Visakha Samacharam
MINI FUNCTION HALL
100 Seating
Call : 99487 49799

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Site For Sale
4000 Sq. Yards
Site with mango tope in Madhurawada I.T.SEZ is for sale. East side 80 feet Road & West side 40 feet Road.
Cell : 8247526179

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 103 విశాఖపట్నం, 28 జనవరి 2024 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## జీవీఎల్‌పై ఏడుపు ఎందుకు ?



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావుపై ఈ మధ్య కొందరికి ఏడుపులు ఎక్కువయ్యాయి. "అమ్మ పెట్టనూ పెట్టదు- అడుక్కు తిననివ్వదు" అనే సామెత అక్షరాలా విశాఖ బీజేపీ నాయకులకు సరిపోతుంది. పనిచేసేవారికి అవకాశం ఇవ్వక, కొత్తవారిని చేర్చుకోక పార్టీని సజీవ సమాధి చేసిన ఘనత ఇక్కడి సీనియర్ నాయకులకు దక్కుతుంది. త్రిశంకు స్వర్గం లాంటి పదవులను ఆశించే వీరికి అప్పుడప్పుడు విశ్వామిత్రుడు లాంటి గురువుల అనుగ్రహం లభించి ఇతర పార్టీల దయతో పదవులు లభించాయి గాని స్వతహాగా పార్టీ ఎన్ఎస్ఎన్ రెడ్డితోటే పదవీ విరమణ పొందింది. వీరు స్థానికులమని, అర్హులమని, అన్నీ మాకే కావాలని, బయటకు చెప్పే ధైర్యం కూడా చేయరు. కేవలం వరద బాధితుల మాదిరిగా ఎవరైనా వచ్చి ఆదుకుంటారనే ఆశతో మాత్రమే జీవిస్తుంటారు. ఈ కొద్దిమందిలోనే అపరమేధావులు, మహాకుట్రదారులు కూడా ఉన్నారనడంలో సందేహం లేదు.

విశాఖ నగరంలో స్థానిక జనాభా 25శాతమైతే వలస ప్రజల శాతం 75. అన్నీ స్థానికులకే కావాలంటూ పోరాడే కమ్యూనిస్టు నాయకులు కూడా విజయవాడ నుండి ఇక్కడకు దిగుమతి చేసుకోబడ్డారు. బీజేపీ నాయకులు ప్రజలకు అన్నం పెడుతుంటే దానిలోని లోపాలను, వంకలను వెతికే ప్రయత్నం చేసి ఏమీ దొరకకపోయినా ఏదో ఒక పుల్లవిరుపు మాటను విసరడం, దానిని ఆనందంగా అందిపుచ్చుకునే కొన్నిపెంపుడు జంతువులు పటపటా కొరుకుతూ కొన్ని శబ్దాలు చేయడం అనవాయితీగా వస్తోంది. అలాగే పార్టీలకు అమ్ముడుపోయిన వీడియో కెమేరాలు, కలంవీరులు జీతాలు తీసుకుంటూ కూడా చేతివాటానికి అలవాటుపడి అది చిక్కకపోతే బాధ్యతారహితంగా అసంపూర్తి వార్తలతో తమ కుళ్లును, ఏడుపును ప్రదర్శించడం, అదేదో పెద్ద విమర్శనాత్మకమైన వార్తగా స్వపాద మర్దనం చేసుకోవడం మామూలే. అలాగే పాటేళ్లపోరాటం నడుమ చిందే రక్తం నాకే నక్కలు మొబైల్ ఫోన్లతోను, పీడీఎఫ్ పేపర్లతోను పెద్దపెద్ద విలేఖర్లుగా చెప్పుకుంటూ పిలవని పేరంటాళ్లకు వెళ్లడం, దక్కితే లొట్టలు వేయడం దక్కకపోతే తిట్లు దండకం చదవడం నగర ప్రజలకు అసహ్యం కల్గిస్తోంది.

ఇక అసలు విషయానికి వస్తే రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు తన రాజకీయ విశ్లేషణలతో దశాబ్దకాలంగా జాతీయ స్థాయిలో పేరు, ప్రఖ్యాతులు సంపాదించారు. ఆయన రాజకీయ పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలనే కోరికతో బీజేపీ పార్టీ నాయకత్వం పార్టీలోకి ఆహ్వానించి ఉత్తరప్రదేశ్ నుండి రాజ్యసభకు ఎంపిక చేసింది. రాజ్యసభలో కూడా తన ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్న జీవీఎల్ సామర్థ్యాన్ని గుర్తించిన పార్టీ ఆయన తెలుగువాడైన కారణంగా ఆయనను ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో బీజేపీ పార్టీని బలోపేతం చేసేందుకు ఎనిమిదేళ్ల క్రితం రాష్ట్రానికి పంపించింది. చంద్రబాబు నాయుడు అకస్మాత్తుగా మోదీపై తిరుగుబాటు ప్రకటించి తిట్లపురాణం అందుకోవడంతో ఆయనకు చెక్ పెట్టేందుకు సమర్థవంతమైన వాక్ చాతుర్యం గల జీవీఎల్‌కు బాధ్యతలు అప్పగించింది. చంద్రబాబునాయుడును, ఆయన అపసవ్య ధోరణులను నిశితంగా బీజేపీ పార్టీ జీవీఎల్ నాయకత్వంలో తిప్పికొట్టిన కారణంగా ఆయన పరాజయం పాలయ్యారు.

జగన్ ప్రభుత్వం బీజేపీ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్న కారణంగా బీజేపీ ఆయనపై ఎక్కువగా కేంద్రీకరించవలసిన అవసరం లేకపోయింది. ఈ నేపథ్యంలో మూడేళ్లక్రితం ప్రధాని నరేంద్రమోది రాజ్యసభ్యులందరిని వారివారి రాష్ట్రాలకు వెళ్లి తమకు నచ్చిన నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకొని 2024 సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభకు పోటీ చేయాలని ఆదేశించారు. అంతేగాక జీవీఎల్ నరసింహారావును విశాఖ పార్లమెంటరీ పార్టీ స్థానంలో పార్టీని బలోపేతం చేయమని ఆదేశించారు. రెండునరేళ్లక్రితం నగరంలో స్థిరపడిన జీవీఎల్ నరసింహారావు అహర్నిశలు శ్రమించి స్థానిక సమస్యలపై పూర్తిగా విశ్లేషించారు. ఉత్తరాంధ్ర ప్రజలకు కేంద్రప్రభుత్వం చేయగలిగే సహాయ సహకారాలను అవగతం చేసుకొని కొన్ని కులాలకు ఓబీసీ రిజర్వేషన్లు, నగరంలోని కేంద్రప్రభుత్వ రంగసంస్థలతో చేపట్టగలిగే అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారాలపై దృష్టిసారించి అనేక విజయాలు సాధించారు. జీవీఎల్ నిరంతర కృషి ప్రజలకు ఆయనను చేరువగా తీసుకువచ్చింది. బీజేపీ పార్టీపట్ల అభిమానం ఉండి కూడా స్థానిక నాయకత్వ నిరంకుశ వైఖరితో పార్టీకి చేరువ కాలేకపోతున్న యువతరం, మహిళలు, జీవీఎల్‌కు జట్టుగా కలిశారు. నగరంలో అనేకవర్గాలకు చెందిన పెద్దలు, పారిశ్రామికవేత్తలు, సంఘాలు, నిత్యం ఆయనను కలవడం సమస్యలపై చర్చించడం, వాటికి ఆయన పరిష్కారాలు సూచించడం అసమర్థులందరికీ కంటగింపుగా మారింది. మీడియాలో కూడా సీనియర్లు ఆయనను అర్థం చేసుకొని ఆయన చేపడుతున్న అభివృద్ధిని ప్రశంసించడం పార్టీలోని కొందరు వృద్ధ జంబూకాలకు కుళ్లిపోయే స్థితిని కల్పించింది.

ఇలాంటి నేపథ్యంలో యువతరం కోరిక మేరకు జీవీఎల్ విశాఖలో నాలుగు రోజుల పాటు సంక్రాంతి నిర్వహించాలని ప్రతిపాదించారు. స్థానిక బీజేపీ నేతలు కొందరు సుముఖంగా లేకపోయినా నగర అధ్యక్షులు రవీంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, నాగేంద్ర వంటివారు ముందుకు వచ్చి ఆయనకు మద్దతు ప్రకటించారు. పార్టీ కేంద్రనాయకత్వానికి జీవీఎల్ ఈ కార్యక్రమం గురించి ప్రతిపాదించగా కొన్ని కేంద్రప్రభుత్వరంగ సంస్థలు తమ ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాలలో తమవంతు భాగస్వామ్యం స్వీకరించాయి. సీఎస్ఆర్ ఫండ్స్ అనగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద కాకుండా తమ వాణిజ్య ప్రకటనల రూపంలో వారి భాగస్వామ్యం సఫలీకృతమై వారికి తగినంత ప్రచారం లభించింది. ఇక్కడ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలే కాకుండా విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, ప్రైవేట్ సంస్థ అయిన స్టార్ హెల్త్ ఇన్స్యూరెన్స్ వంటివి కూడా తమతమ స్టాల్స్‌తెరిచి ప్రచారం నిర్వహించాయి.

విశాఖపట్నం డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు వైఎస్సార్‌సీపీ పార్టీకి నగరాధ్యక్షులుగా కూడా ఉన్నారు. అదృష్టవశాత్తు మన కుళ్లు కమ్యూనిస్టు నాయకులుగాని, ముష్టి మీడియా బృందాలు గాని జీవీఎల్ వైసీపీలో చేరిపోయారని లేదా కోలా గురువులు బీజేపీలో చేరిపోయారని రాయలేదు. జీవీఎల్‌పై వార్తలు రాస్తున్న విలేఖరులు ఏ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ వద్దకూ వెళ్లి మీరు ఎంత ఇచ్చారు ? ఎందుకు ఇచ్చారు ? మీకు ఫలితం లభించిందా ? అని కనీసం అడగకుండా ఇచ్చారుటా- పుచ్చుకున్నారుటా- అనుకుంటున్నారుటా అంటూ తమ వ్యక్తిగత అక్కసును బొళబొళా కక్కుకున్నారు.

ఇక సంబరాల విషయానికొస్తే నగర ప్రజలు ఐదురోజుల పాటు అద్భుతమైన సంక్రాంతి సంబరాలను ఆస్వాదించారు. కనీవినీ ఎరుగని రీతిలో నిర్మించిన సంక్రాంతి గ్రామాన్ని సందర్శించి ప్రతీచోటా ఫొటోలు దిగి జ్ఞాపకాలను భద్రంగా దాచుకున్నారు. సుమారు 300 మంది కళాకారులు ఇక్కడ తమ ప్రదర్శనలు నిర్వహించి పారితోషికాలు పొందారు. సుమారు 400 మంది కార్మికులు నిరంతరం శ్రమించి గ్రామ నిర్మాణంలోనూ, పారిశుద్ధ్య నిర్వహణలోను పాల్గొని ఉపాధిని పొందారు. లక్షా 50వేల మందికి పైగా సందర్శకులు ఉదయం 10 నుండి రాత్రి 10 వరకు 12 గంటల పాటు నిరంతరాయంగా అక్షయపాత్ర ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన ప్రసాదాలను పవిత్రంగా ఆరగించారు. ఎస్‌బీఐ, యూబీఐ, సీబీఐ, ఐఓసీ వంటి సంస్థల ప్రతినిధులు తమ ప్రచారాన్ని నాలుగురోజుల పాటు నిరంతరాయంగా కొనసాగించారు. సుమారు 150 మంది చేనేత కార్మికులు తమ దుకాణాలు తెరిచి కోటి రూపాయలకు పైగా వర్తకం జరిపారు. అనేకమంది ఆహారపదార్థ విక్రేతలు కూడా విశేషమైన లాభాలు ఆర్జించి తమకు ఉచితంగా కల్పించబడిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

ఇదేవిధంగా వైబ్రాంట్ వైజాగ్ పేరుతో రెండురోజుల రిపబ్లిక్‌డే ఉత్సవాలను జీవీఎల్ బృందం విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వేలాదిమంది పాఠశాలల విద్యార్థులు, యువతీ యువకులు, అనేకమంది నడకరులు, సందర్శకులు ఆనందంగా పాల్గొని దేశభక్తిని ఇనుమడింపజేశారు. దేశభక్తిని కల్పించే కార్యక్రమం చేయడం కూడా వ్యక్తిగత ప్రచారంగా ఏడ్చేవారికి ఏం చెప్పాలో అర్థం కాదు. ఒక కార్యక్రమం నిర్వహించేటప్పుడు నిర్వాహకుడి సామర్థ్యం ఆధారంగా ఆయనకు ప్రచారం లభిస్తుంది. మరుగుదొడ్లపై ముఖ్యమంత్రి ఫొటోలు అతికిస్తే విమర్శించే సత్తాలేని కమ్యూనిస్టులు, తోక ఊపుతూ ఎటు తిరగాలో తెలియక తిరుగాడే మీడియా పెంపుడు జంతువులు కేవలం జీవీఎల్‌పై విరుచుకుపడడం వారి ఆక్రోశానికి, నిరాశ నిస్పృహలకు నిదర్శనంగా భావించాలి. ఈ నేపథ్యంలో తమకు తెలియకుండా తమ విమర్శలలో వారు ఎక్కడనుండి ఎక్కడికో వెళ్లిపోతున్నారు. జాతీయ స్థాయి మీడియాగా చెప్పుకునే సంస్థలు కూడా తమ అవివేకాన్ని ప్రదర్శించేలా వాటి విమర్శలు కనిపిస్తున్నాయి.

ఏది ఏమైనా వసుధైక కుటుంబంగా భాసిల్లుతున్న విశాఖ నగరానికి స్థానికత అనే సంకుచిత భావం ఎన్నడూ లేదు. ప్రజలు ఎప్పుడూ మంచినే ఆదరించారు. నిజాయితీని గౌరవించారు. జీవీఎల్‌కు బీజేపీ అధినాయకత్వం టిక్కెట్ ఇస్తుందో లేదో గాని ఇక్కడ లేనిపోని ఆశలను అసమర్థులకు మీడియా కల్పిస్తోంది. ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగరబోయిందని, చావుతప్పి కన్నులొట్టబోయిన వారు భీకర సంగ్రామానికి సిద్ధంగా ఉన్నారని వ్రాయడం అవివేకాన్ని ప్రదర్శించడమేగాని మరేమీ కాదు.

-సూరంపూడి వీరభద్రరావు

## నేడు జొన్నవిత్తుల కార్యక్రమం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రఖ్యాత సినీ గేయ రచయిత, తెలుగు వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు నేతృత్వంలో కొంతమంది భక్త చైతన్య వంతుల బృందం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల చరిత్రను అధ్యయనం చేస్తోంది. పలు దేవాలయాల నిర్మాణం వెనుక గల పెద్దల కృషి, దాతల దాతృత్వం, దేవాలయాలకు సంక్రమించిన ఆస్థులు, వాటి నిర్వహణ తీరులో జరుగుతున్న అప చారాలు, కావాలని దేవాలయాల ఆస్థులను కొల్లగొడుతున్న పెద్దల తీరుతెన్నులు, కైంకర్యమైపోయిన దేవాలయాల ఆస్థి పాస్తులు వగైరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఈ బృందం తమ అధ్యయన విశేషాలను రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాలలో సభలు ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేస్తోంది. ఈ పరంపరలో భాగంగా 28 జనవరి ఆదివారం సాయంత్రం మద్దిలపాలెం జంక్షన్ సమీపంలో గల ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్

(మిగతా 2లో)

## భీమిలిలో జగన్ ఎన్నికల సమర శంఖారావం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** ముఖ్య మంత్రి జగన్ ఎన్నికల సమరశంఖం పూరించారు. ఎంత మంది కలిసినా...ఎన్ని ఎత్తులు వేసినా..వారి వ్యూహంలో చిక్కుకోవటానికి ఇక్కడ ఉన్నది అభిమన్యుడు కాదని..అర్జునుడు అంటూ తాను ఏ స్థాయి లో సిద్ధంగా ఉన్నది తేల్చి చెప్పారు. చంద్రబాబుతో సహా అందరూ ఓడాల్సిందేనని నినదించారు. మీ మద్దతు ఉన్నంత కాలం తొణకను..బెణకను అం టూ సీఎం జగన్ గర్జించారు. 175కి 175 సీట్లు గెలవాల్సిందే అంటూ...ఈ బాధ్యత ప్రతీ కార్యకర్త తీసుకోవాలని జగన్ పిలుపునిచ్చారు.

**ఎవరికీ బెదరను :** ముఖ్యమంత్రి జగన్ దేవుడి దయ..ప్రజల మద్దతు ఉన్నంత కాలం ఎవరికీ బెదరనని చెప్పుకొచ్చారు. భీమిలో సిద్దం సభ ద్వారా ఎన్నికల్లో తన లక్ష్యం ఏంటో జగన్ చాలి చెప్పారు. పార్టీ జైత్రయాత్ర కొనసాగాలని.. మరో 25 ఏళ్లు

(మిగతా 2లో)

స్వాగతం – సుస్వాగతం
వంద గుడుల 'బండారం'
భక్త చైతన్య యాత్ర బృందానికి అభినందన సభ

ముఖ్య అతిథి
శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం
ఆం.ప్ర.పూర్వ ప్రధాన కార్యదర్శి
తేది : 28-1-2024
సమయం : సా॥ 5:30 గం॥లకు
వై.వి.ఎస్. మూర్తి ఆడిటోరియం,
ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్
కళాశాల ప్రాంగణం,
విశాఖపట్టణం

శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు
తెలుగు వేద కవి

# నువ్వు సిద్ధమైతే మేమూ సిద్ధమే : చంద్రబాబు సవాల్

ఉమ్మడి చిత్తూరు జిల్లా పీలేరులో నిర్వహించిన రా కదలిరా బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం జగన్, మంత్రులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాటు దోచుకున్న సొమ్ముతో 'సిద్ధం' అంటూ జగన్ రెడ్డి ప్రచార సభలు నిర్వ హిస్తున్నారని విమర్శించారు. జగన్ రెడ్డిని ఇంటికి పంపేందుకు రైతులు, యువత, మహిళలు, విద్యా ర్థులు, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు స్పష్టం చేశారు.

గత ఎన్నికల్లో జగన్ ముద్దులకు మురిసిపోయి ఓట్లేశారని, కానీ ఈ ప్రాంతంలో జగన్ చేసిన అభివృద్ధి ఏంటి? ఒక్క ప్రాజెక్టు కట్టాడా, ఒక్క పరిశ్రమ తెచ్చాడా? అని నిలదీశారు.

"నేను కూడా రాయలసీమ బిడ్డనే... నాలో ప్రవ హించేది సీమ రక్తమే. టీడీపీ 5 ఏళ్ల పాలనలో రాయలసీమలో ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం ఏకంగా రూ. 12,500 కోట్లు ఖర్చు చేశాం. ఈ 5 ఏళ్లలో జగన్ రెడ్డి ఎంత ఖర్చు చేశారో చెప్పగలరా? పీలేరు, పుంగనూరుకి నీళ్లొచ్చాయా? రాయలసీమ ద్రోహి జగన్ రెడ్డి.

తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు నగరి అన్ని ప్రాజెక్టులు టీడీపీ హయాంలో ప్రారంభమైనవే. వాటిని పూర్తి చేసే బాధ్యత టీడీపీదే. పట్టిసీమ ద్వారా గోదావరి నీళ్ల శ్రీశైలం ద్వారా 120 టీఎంసీలు ఇచ్చిన ఘనత టీడీపీదే. టీడీపీ ఉంటే గోదావరి నీళ్లు బనకచర్లకు తీసుకొచ్చే వాళ్లం.

ప్రతి సంవత్సరం 2 వేల టీంఎసీ గోదావరి నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. తవ్విన కాలువలు పూర్తి చేసి ఈ నీటిని తెస్తే రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. రాయలసీమను పండ్ల తోటలకు హబ్ గా చేయాలని కృషి చేశా. దుర్మార్గులు అంతా నాశనం చేశారు.

నాడు 90 శాతం సబ్సిడితో డ్రిప్ ఇరిగేషన్ ఇచ్చాం. కడప జిల్లాలో అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి 40 మంది చనిపోయారు. 450 ఇండ్లు కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు ఆ డ్యాం కట్టారా? బాధితులకు ఏం న్యాయం చేశారు? ప్రాజెక్టు గేట్లకు గ్రీసు వేయలేని సీఎం 3 రాజధానులు కడతారా? ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా బాధిత



కుటుంబానికి రూ. 1 లక్ష చొప్పున ఇచ్చాం" అని చంద్రబాబు వివరించారు.

**వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల దోపిడీకి అడ్డూ, అదుపు లేదు!**

వైసీపీలో ఒక్కరైనా విలువల గల మంత్రి ఉన్నారా? టూరిజం మంత్రిని చూస్తే, వాళ్ల కార్యకర్తల దగ్గర నామినేటెడ్ పదవుల కోసం డబ్బులు తీసుకున్నారు. పాపాల పెద్దిరెడ్డి అన్నం తినడం లేదు, అయనకు టిఫిన్ ఇసుక, లంచ్ మైన్స్, డిన్నర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు! బకాసురుడిని మించిపోయాడు పెద్దిరెడ్డి. పుంగనూరులో ఈసారి పెద్దిరెడ్డి గెలవడు. ఇలాంటి దుర్మార్గులు రాజకీయాలకు అనవసరం. పుంగనూరులో టీడీపీ జెండా ఎగురుతుంది. నా దయాదాక్షిణ్యాల వలన పెద్దిరెడ్డి గెలిచారు. కానీ ఇప్పుడు ఆయన ఎలా గెలుస్తారో చూస్తాను.

**రేపు నీ వద్ద అధికారం ఉండదు పెద్దిరెడ్డీ... అప్పుడేం చేస్తావ్?**

వైసీపీ పాలనలో ప్రాజెక్టులపై నిర్లక్ష్యం, పెద్దిరెడ్డి దోపిడీని బహిర్గతం చేస్తే అంగళ్లులో మన మీద దాడి చేసి 600 మందిని జైల్లో పెట్టారు. పెద్దిరెడ్డి పోలీసులు లేకుండా ఇంట్లో నుంచి బయటకు రాలేదు. కాని రేపు నీ దగ్గర అధికారం ఉండదు... అప్పుడు నిన్ను శిక్షించే బాధ్యత టీడీపీదే. పులివెందుల్లో కూడా మీ సైకో గెలవడని జగన్ కు చెప్పు పెద్దిరెడ్డీ!

బెరైటీస్ అంతా ఊడ్చేశారు... ఎర్రచందనం స్మగ్లింగ్ చేశారు. ఆవులపల్లి రిజర్వాయర్ కట్టి రూ. 600 కోట్లు అడ్వాన్స్ తీసుకున్నారు, ఈయన పాపాలకు ఎన్జీటీ రూ. 100 కోట్ల జరిమానా వేసింది. శివశక్తి డైరీతో పాడి రైతుల్ని దోచుకుంటున్నారు. పాపాల పెద్దిరెడ్డి రూ. 35 వేల కోట్ల ప్రజాధనాన్ని దోపిడి చేశారు. దోచిన డబ్బంతా కక్కిస్తాం.

**రాజకీయనేతలా... బందిపోట్లా!**

పెద్దిరెడ్డి ఆయన కొడుకు, తమ్ముడు బందిపోట్ల మాదిరి తయారయ్యారు. తంబళపల్లెలో ఎక్కడ స్థలం కనపడితే దాన్ని కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వ భూముల్ని అన్యాక్రాంతం చేస్తున్నారు. పీలేరు ఎమ్మెల్యే పీలేరును పీల్చి పిప్పి చేస్తున్నాడు. పీలేరు, కలిగిరి, గుర్రం కొండ మైనింగ్ లో ఈయనే భాగస్వామి. రూ.400 కోట్ల విలువైన భూముల్ని, రూ. 500 కోట్ల విలువైన ఇసుకను దోచుకున్నారు.

మదనపల్లె, రాజంపేట ఎమ్మెల్యేలను మార్చారు. కానీ పాపాల పెద్దిరెడ్డిని ఎందుకు మార్చలేదు? రైల్వే కోడూరు ఎమ్మెల్యే మంగపేట ముగ్గు గనులు, ఎర్రచందనం దోచుకుంటున్నారు. రాయచోటి ఎమ్మెల్యే భూములు దోచుకుంటున్నాడు. ఇలాంటి వాళ్లు మనకు అవసరమా? వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులందరినీ చిత్తు చిత్తుగా ఓడించాలి.

టీడీపీ అధికారంలోకి వచ్చాక... పీలేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తాం. హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తి చేసి చెరువులకు నీళ్లిస్తాం. ఏపీఐఐసీ ద్వారా సేకరించిన 2500 ఎకరాల్లో పరిశ్రమలు తెస్తాం. మదనపల్లె, తిరుపతి రోడ్డును పూర్తి చేస్తాం. టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం. రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తాం" అని చెప్పారు.

| | | |
|---|---|---|
| **పంచాంగం** | | |
| ఆదివారం 28-01-2024 | | |
| శోభకృత్ నామ సంవత్సరము | | |
| ఉత్తరాయణం , హేమంత ఋతువు | | |
| పుష్య మాసం | | |
| తిథి | : బ. తదియ తె. 04.02 | |
| నక్షత్రం | : మఖ ప. 02.34 | |
| వర్జ్యం | : రా. 11.25 ల 01.12 | |

## వైసీపీ, టీడీపీపై మాటల తూటాలు ప్రారంభించిన షర్మిల

తెలంగాణలో వైఎస్ఆర్టీపీ స్థాపించి కాంగ్రెస్‌లో విలీనం చేసి ఏపీ పీసీసీగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల రాజకీయంగా దూకుడు ప్రదర్శిస్తున్నారు. పదునైన మాటలు, నికాసైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా పర్యటనలు మొదలు పెట్టేశారు. ఈ తరుణంలో వైసీపీ నేతలు షర్మిల గతంలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ సందర్భంగా వారి మాటలకు తనదైన తూటాలను ఎక్కుపెడుతున్నారు షర్మిల. తాజాగా వైసీపీ నేతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తనపై ముప్పేట దాడి చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీని

భుజాన వేసుకుని పనిచేశానన్నారు. నారక్తం, చెమట ధారపోశానని గతాన్ని గుర్తుచేశారు. ఇక్కడ ఎవరూ భయపడరు యుద్ధానికి మేము రెడీ.. మీరు రెడీనా అంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు. ఏపీలో ప్రత్యేక హెూదా రావాలి.. పోలవరం పూర్తికావాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలి. అందుకే రాజన్న బిడ్డగా ముందుకు వచ్చానని చెప్పుకొచ్చారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టుకు మెయింటెన్స్ చేసే దిక్కు కూడా లేకుండా పోయిందని విమర్శించారు. టీడీపీ, వైసీపీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయని ఆరోపించారు. వైయస్ఆర్ ఆశయాలను నెరవేరుస్తున్నామని చెబుతున్న వారు ప్రాజెక్టును ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో వైయస్ఆర్ లేరన్నారు. ఇది జగన్ పార్టీ ప్రజలను పట్టించుకోని పార్టీ అంటూ సంచలన కామెంట్స్ చేశారు. వై అంటే వైవి సుబ్బారెడ్డి, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే రామకృష్ణారెడ్డి అని ఎద్దేవా చేశారు. జిల్లాలో నిమ్జ్ ఏర్పాటు చేయాలని వైఎస్ఆర్ సంకల్పించారన్నారు. తద్వారా 3 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలనుకున్నారు. జగన్ సీఎం కాకముందు నిమ్జ్‌ను పూర్తి చేస్తామని చెప్పి ఒక్క ఇండస్ట్రీని కూడా తీసుకురాలేదన్నారు. ఏ ఒక్కరికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారన్నారు. జిల్లాకో ఎయిర్ పోర్టు అని చెప్పారు. బోయింగ్‌లు తిప్పుతామన్నారు చెప్పిందంతా గాలికి పోయిందన్నారు వైఎస్ షర్మిల.




## (మొదటి పేజీ తరువాయిలు)

### భీమిలిలో జగన్ ఎన్నికల సమర శంఖారావం

సంక్షేమం - అభివృద్ధి పాలనకు ఇది సన్నాహక సమావేశంగా జగన్ విశ్లేషించారు. చంద్రబాబు ఒం టరిగా గెలవలేక పొత్తుల కోసం పాకులా డుతున్నారని ఎద్దేవా చేసారు. మంచి చేసానని ..తనకు ఓటు వేయమని అడగలేని పరిస్థితుల్లో చంద్రబాబు ఉన్నారని ఎద్దేవా చేసారు. ఏం చేయని చంద్రబాబు మరోసారిగా కొత్త వాగ్దానాల గారడీతో ప్రజల ముందుకొస్తున్నారని చెప్పు కొచ్చారు. తన ప్రభుత్వం చేసిన మంచి పనులే తనను గెలిపిస్తాయని జగన్ ధీమా వ్యక్తం చేసారు. 175 సీట్లు గెలవాల్సిందేనని నినదించారు.

**చంద్రబాబు సహా ఓడాల్సిందే** : చంద్రబాబుకు 175 స్థానాల్లో పోటీకి అభ్యర్థులు కూడా లేరని జగన్ వ్యాఖ్యానించారు. వైసీపీ చరిత్ర ఓ విప్లవ గాథ..ప్రభుత్వంది ఇంటింటి విజయగాథగా జగన్ చెప్పుకొచ్చారు. వైసీపీది వయసుతో పాటుగా మనసు, భవిష్యత్ ఉన్న పార్టీగా జగన్ పేర్కొన్నారు. 99 శాతం హామీలు అమలు చేసిన పార్టీ వైసీపీ ఘనతగా జగన్ చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల యుద్ధం అబద్ధానికి - నిజానికి, మోసానికి- విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న యుద్ధంగా జగన్ విశ్లేషించారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం దాకా ఏ గ్రామానికి వెళ్లినా వైసీపీ ప్రభుత్వం, జగన్ మార్క్ పాలన కనిపిస్తుందని చెప్పారు. అక్కడ చంద్రబాబు ఏం చేసారంటే చెప్పటానికి ఏం లేదన్నారు. ప్రతీ గ్రామంలో సచివాలయంతో ప్రజల వద్దకే సేవలు అందిస్తున్నామని జగన్ చెప్పారు.

ఓటు వేయకుండా ఉండగలరా : చంద్రబాబువి పెత్తందార్ల పాలన, పెత్తందార్ల ఆలోచనగా జగన్ వివరించారు. రైతులను రుణమాఫీ పేరుతో మోసం చేసారని గుర్తు చేసారు. రైతు భరోసా అంటే జగన్ గుర్తుకు వస్తారని చెప్పారు. పగటి పూటే ఉచిత విద్యుత్, ఆర్బీకే కేంద్రాలంటే గుర్తుకు వచ్చేది జగన్ అని వివరించారు. లంచాలు, వివక్షతకు తావు లేకుండా పథకాలు, పాలన అందిస్తున్నామని జగన్ చెప్పుకొచ్చారు. చంద్రబాబుకు చెప్పుకొనేది ఏముందని జగన్ ప్రశ్నించారు. విద్య, వైద్యం, సామాజిక న్యాయం, మహిళా సాధికారిత గురించి వివరించారు. ఇవన్నీ చూసిన తరువాత వైసీపీకి ఎవరైనా ఓటు వేయకుండా ఉంటారా..తోడుగా నిలబడకుండా ఉండగలరా.. టీడీపీకి ఎవరైనా ఓటు వేస్తారా అని జగన్ ప్రశ్నించారు. ఎక్కడ చూసినా వైసీపీ, జగన్ మార్క్ కనిపిస్తోందని జగన్ చెప్పుకొచ్చారు.

### నేడు జొన్నవిత్తుల కార్యక్రమం

వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో ఒక సభను ఏర్పాటు చేశారు.

ఈ సభకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్య కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, విశిష్ట అతిథులుగా విజయ్‌నిర్మాణ్ సంస్థ అధినేత సూరపనేని విజయ్‌కుమార్, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రఖ్యాత పద్యకవి వామరాజు సత్యమూర్తి, అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, సంస్కృతాంధ్ర పండితులు పి.టి.జి.వి. రంగాచార్యులు, సాహితీవేత్త నేమాని మంజునాథ శర్మ, సీనియర్ జర్నలిస్ట్ జీవీఎస్ మూర్తి పాల్గొంటారు. రొటేరియన్ వీరభద్రరావు సభాధ్యక్షులుగా వ్యవహరిస్తారు. పతంజలి యోగాకేంద్ర వ్యవస్థాపక అధ్యక్షులు జి.వేదభాస్కరం కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కుమారి ఘట్టి శ్రీవిద్య బృందంచే భక్తి సంగీత విభావరి ఉంటుంది.

విశాఖ సమాచారమ్
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345,
8247526179

## నిర్మలమ్మ బడ్జెట్‌లో విశేషాలేమిటి ?



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024 ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జె ట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. సం ప్రదాయం ప్రకారం ఈ బడ్జెట్‌లో పెద్దగా ప్రకటనలు ఉండక పోగా, ఈసారి ఎన్ని కలకు ముందు నిర్మలా సీతారామన్ వేరే మార్గాన్ని ఎంచుకోవచ్చు. ఏది ఏమైనప్పటికీ, బడ్జెట్‌లో ప్రభుత్వం ఏయే రంగాలపై ఎక్కువ దృష్టి పెట్టబోతుందో ఇటీవల ఆమె తెలిపారు.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొద్ది రోజుల క్రితం ఢిల్లీ యూనివర్సిటీలోని హిందూ కాలేజీలో విద్యార్థులతో ముచ్చటించారు. 2014 తర్వాత మోదీ ప్రభుత్వం 'అత్యవసరం', 'మిషన్ మోడ్'లో పథకాలను ఎలా అమలు చేసి అభివృద్ధి చెందిన భారతదేశానికి పునాది వేసిందో ఆమె ప్రసంగంలో చెప్పారు. బడ్జెట్‌లో ప్రభుత్వ దృష్టి ఎక్కడ ఉండబోతోందని ఈ ప్రసంగంలో చెప్పారు.

తమ ప్రభుత్వం కులం లేదా మతం ఆధారంగా ప్రజల మధ్య వివక్ష చూపదని నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో చెప్పారు. అందుకోసం ప్రభుత్వ పథకాలు అందరికీ అందే విధంగా రూపొందించాలి. ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశాన్ని యువత, మహిళలు, రైతులు, పేదలు అని నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రభుత్వ విధానాల్లో ఈ 4 గ్రూపులను దృష్టిలో ఉంచుకోవా లని బడ్జెట్‌ను రూపొందించడం జరుగుతుందన్నారు.

"యువకులు, మహిళలు, మనకు ఆహార భద్రతను అందించే మంచి రైతులు, ఇంకా ఎదగడానికి ప్రభుత్వ సహాయం. మా పాలసీలన్నీ వారి జీవి తాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశిం చినవి. మీరు మరేదైనా శ్రద్ధ వహిం చాల్సిన అవసరం లేదు. అతను ఏ వర్గా నికి చెందినవాడో, ఏ మతానికి చెందిన వాడో చూడకూడదు. ప్రతి ఒక్కరూ వారి పరిధిలోకి వస్తారు. అని అన్నారు.

ఇది మాత్రమే కాదు, నిర్మల తన ప్రసంగంలో ఆర్థిక కోణం నుండి ప్రభుత్వం దృష్టి పెట్టబోయే విభాగాలను కూడా సూచించింది. ఇందులో నైపుణ్యాభివృద్ధి, మెరుగైన వ్యవసాయ సాంకేతికత, దేశ పౌరులకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించడంపై మా దృష్టి ఉంది అని అన్నారు.

## ఏపీ బీజేపీలో సంస్థాగత నియామకాలు



ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఏపీ బీజేపీ సంస్థాగత నియామకాలపై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి దృష్టి సారించారు. ఇవాళ క్లస్టర్ ఇన్చార్జిలు, సహ ఇన్చార్జిలు, లోక్ సభ స్థానాలు సంయోజకులు, ప్రభారీలను ప్రకటించారు. తక్షణమే ఈ నియామకాలు అమల్లోకి వస్తాయని పురందేశ్వరి పేర్కొన్నారు. 25 జిల్లాలను ఐదు క్లస్టర్లు చేసి వాటికి ఇన్చార్జిలను, సహ ఇన్చార్జిలను నియమించారు. అదే సమయంలో 25 పార్లమెంటు స్థానాలకు సంయోజకులను, ప్రభారీలను నియమించారు.

మోహన వెంకట రెస్ట్ హోమ్స్ (రి)
ప్రశాంతినగర్, తిరుపతి: ఫోన్ : 9393932718
మీరు ప్రతీఏటా తిరుపతి-తిరుమల పుణ్యక్షేత్రంలోని శ్రీవేంకటేశ్వర, పద్మావతి అమ్మవార్ల దర్శనం ఇష్టంగా చేసుకుంటూ ఉంటారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల కారణంగా ఇప్పుడు తిరుపతిలో గాని, తిరుమలలో గాని వసతి చాలా కష్టమవుతోంది.
ఇలాంటి సమస్యకు పరిష్కారంగా తిరుపతిలో (బస్‌స్టాండ్ రైల్వేస్టేషన్‌లకు కేవలం 8.5 కి.మి. దూరంలో) ప్రకృతి వనరులతో 14 ఎకరాల స్థలంలో ప్రశాంతినగర్ నిర్మాణంలో ఉంది.
అనేక అధునాతన సౌకర్యాలతో సుమారు 500 స్టూడియో అపార్ట్‌మెంట్లు మీకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే 40 అపార్ట్‌మెంట్లతో ఒక బ్లాక్ సిద్ధంగా ఉంది. 24X7 రవాణాసౌకర్యం కూడా యాజమాన్యం కల్పించింది.
సంవత్సరానికి 5 రోజులు ఈ సుఖప్రదమైన ఆవాసం పొందడానికి మీకు ఇప్పుడు చక్కని అవకాశం లభిస్తోంది. కేవలం ఒక లక్షరూపాయలు (+ 18శాతం జీఎస్టీ చెల్లించి) ఒక సింగిల్ బెడ్ అపార్ట్‌మెంట్‌ను మీరు ఒక సంవత్సరంలో 5 రోజులు చొప్పున 12 ఏళ్ల పాటు వినియోగించుకోవచ్చును.
లభించే సదుపాయాలు : ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ సదుపాయం. 24X7 రవాణా సౌకర్యం. మీరు స్వయంగా కూడా వాహనాలు నడపవచ్చు. (2,4 వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు) 24X7 క్లినిక్, గదిలో ఫ్రిజ్, మంచం, పరుపు, ఏసీ, సోఫా, టేబుల్, ఎల్‌పీజీ స్టౌ, గిన్నెలతో సహా కిచెన్.
పూర్తి శాఖాహార భోజన, ఫలహారశాల, అన్నిరకాల వస్తుసామాగ్రి దుకాణములు, వాకింగ్ ట్రాక్, ఈతకొలను, ఔషధ మొక్కలతో కూడిన వనసంపదల ఉద్యానవనం. అహ్లాదకరమైన ఆధ్యాత్మిక సంగీతభరిత వాతావరణం, ఉచిత వైఫై లభిస్తాయి.
24×7 రక్షణ, లాండ్రీ, ఇతర సేవలు లభిస్తాయి.
వివరములకు సంప్రదించండి.
9393949345, 8247526179

# విశాఖ సమాచారమ్

ఆదివారం 28-01-2024


# దైవ సంపద

మనిషి దేముడినే సృష్టించాడో లేక దేముడు మానవుడిని సృష్టించాడో అర్థంకాన్ని చర్చలు, పోట్లాటలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఎవరు ఎవరిని సృష్టించినా మానవుడు మాత్రం ప్రతీక్షణం భగవన్నామస్మరణ చేస్తూ తన కృతజ్ఞతను చాటుకుంటున్నాడు. భగవంతుడి శక్తిని, ఆయన దయాదాక్షిణ్యాలను, ధర్మనిబద్ధతను పురాణేతిహాసాలు సమాజానికి వేలసంవత్సరాల క్రితమే తెలియజేసి పవిత్రమైన జీవిత మార్గాన్ని ప్రబోధించాయి.

దైవం అనే సృష్టికర్త ప్రకృతిని, అందులోని భాగమైన మనిషిని పూర్తిగా తన ఆధీనంలో ఉంచుకొని సమయానుసారంగా ఋతువులు, వాతావరణాలు, ఆహార విహారాలు మానవుడికి అందేలా చేస్తాడని భక్తులంతా విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలోనే భగవంతుడికి రూపం ఏర్పాటు చేసి దానిని విగ్రహాల ద్వారా ప్రతిష్ఠించి వేదమంత్రాలతో పవిత్రతను ఆపాదించి భక్తులు తమ ఆరాధ్యదైవాలను కొలుచుకునేందుకు వీలుగా దేవాలయ వ్యవస్థను పూర్వీకులు ఏర్పాటు చేశారు. ఇలాంటి దేవాలయాలలో వివిధ రకాల బాధ్యతలను నిర్వర్తించే అవకాశాన్ని అనేక వర్గాల వారికి కల్పించారు.

దేవాలయనిర్మాణానికి, విగ్రహాల తయారీకి శిల్పులు, దేముడి నగల తయారీకి విశ్వ బ్రాహ్మణులు, తలుపుల నిర్మాణానికి వడ్రంగులు, అర్చనకు పూజారులు, పల్లకీకి బోయిలు, వాయిద్యాలకు నాయీ బ్రాహ్మణులు, కాగడాల వెలుగుకు రజకులు, పూలతోటల సంరక్షణకు, దేవాలయ భూములలో పంటలు పండించేందుకు రైతులు, దేవాలయ గో సంపద రక్షణ నిమిత్తం గోపాలురు వంటి వారందరికీ భగవత్ సేవలో భాగంతో పాటుగా భృతిని కూడా కల్పించారు.

మహారాజులు, జమిందార్లు, దేశంలోని అనేక లక్షల దేవాలయాలకు ఆస్థులు, నగలు, నగదు తమతమ బహుమతులుగా అందజేసి అనేక రకాల వ్యవస్థల జీవనోపాధికి కారకులయ్యారు. దేవాలయాల నిర్వహణలో కీలకమైన ఈ వర్గాల ప్రజలందరూ దేముడి భక్తబృందాలను, భజన బృందాలను, నాట్య బృందాలను కూడా తమతో పాటుగా తయారు చేశారు.

దేవాలయాల ఆస్థులు కౌలుచేసేవారు, వాటిపై అజమాయిషీ చేసేవారు, లెక్కలు రాసేవారు, ఇలా ఎంతోమంది దేవాలయ వ్యవస్థపై ఆధారపడి జీవనాలు సాగిస్తున్నారు. దేవాలయాల ఆస్థులను, భక్తులు అందజేసే విరాళాల ద్వారా వచ్చే నగదు, కానుకలు, బంగారాలను ఆయా దేవాలయ ధర్మకర్తృత్వ బృందాలు ఎంతో నిజాయితీగా రక్షిస్తూ పేదలకు అన్నదానాలు నిర్వహించి వారి ఆకలిని తీరుస్తూ దేముడి కృపకు పాత్రులు అయ్యేవారు. క్రమేణా దేవాలయ ధర్మకర్తల మండలి నుండి అట్టడుగు సేవకుడి వరకు అనేక మందిలో ప్రలోభం, స్వార్థం, దుర్బుద్ధి ప్రబలి దేవాలయాలలో భక్తులు అసహ్యించుకునే అవినీతి ఊడలూనుకుంది. ఈ అవినీతి నగదు, నగలు చివరికి దేవాలయ మాన్యాలను కూడా నిర్భీతిగా మింగేసే స్థాయికి పెరిగింది. ఏ ఒక్కరిలోనైనా పాపభీతి కనపడుతుందేమోనని ఆశపడే భక్తులు మౌనంగా భగవంతుని వేడుకోవడం మినహా ఏమీ చేయలేకపోతున్నారు.

కోట్లాది ఎకరాల భూములను కొందరు రాజకీయ నాయకులు, కొందరు జమిందార్లు, కొందరు కౌలుదార్లు ఆక్రమించుకోగా వారికి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు అధికారుల రూపంలో మద్దతుగా నిలుస్తున్నారు. కొన్నిచోట్ల నిజాయితీగల అధికారులు వ్యతిరేకించి దేవాలయాల తరపున అటువంటి దురాక్రమణదారులపై వ్యాజ్యాలు కూడా నెరపుతున్నారు. ఇక నేరుగా గుడిపై దాడిచేసి భక్తుడి నగలు దోచేసేవారు, హుండీలను పగులగొట్టి చోరీలు చేసేవారు వార్తల ద్వారా కనబడుతూనే ఉన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులలో కొందరు ధర్మకర్తల రూపంలో కొందరు యథాశక్తి దోపిడీలు చేస్తున్నారు. కాలం కలిసిరానివారు దొరికిపోయి శిక్షలు అనుభవిస్తుండగా అత్యధికులు వైభోగాలు అనుభవిస్తున్నారు.

హిందూధర్మాన్ని కాదని ఇతర ధర్మాలను ఆశ్రయించినవారు ఎక్కడలేని ధైర్యం కూడగట్టుకొని హిందూదైవదూషణకు, హిందూదేవాలయాల ధ్వంసానికి, విగ్రహాల విధ్వంసానికి పాల్పడుతున్నారు. ఒకానొక సమయంలో పవిత్రమైన రామమందిరాలు, శివాలయాలు, మతోన్మాదుల మానసిక పరాకాష్టకు బలి అయి వాటిస్థానంలో సమాధులు నిర్మించబడ్డాయి. ఇటువంటి ఆధ్యాత్మిక అపచారాలను హిందువులు సహనంతో భరిస్తూ హైందవేతరులకు, సనాతన ముసుగు దొంగలకు అవకాశాలు కలగనిస్తున్నారు.

ప్రఖ్యాత సినీగేయ రచయిత, విమర్శకులు, పరమభక్తులు అయిన సరస్వతీ పుత్రులు శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దేవాలయాలలో జరుగుతున్న ఇటువంటి అక్రమాలపై ధ్వజమెత్తారు. గుడుల నిర్వహణలో గల ఆంతరంగిక వ్యవహారాలను, కుట్రలు, కుతంత్రాలను, దోపిడీలను సాక్ష్యాధారాలతో రుజువు చేస్తూ *'వందగుడుల బండారం'* పేరుతో ఒక అధ్యయన యాత్ర కొనసాగిస్తున్నారు. ఈ యాత్ర భగవత్ప్రేరితమైన జైత్రయాత్రగా విరాజిల్లి, గుడుల వెనుక జరుగుతున్న అపచారాలను బయటపెట్టి ఆస్థులను తిరిగి ఆయా దేవాలయాలకు తెచ్చిపెట్టే విజయయాత్రగా కొనసాగాలని, దైవభక్తిగల నిజాయితీపరులు ఈ ఉద్యమంలో చేరి హిందూధర్మాన్ని కాపాడేందుకు చేతులు కలపాలని విశాఖ సమాచారమ్ పిలుపునిస్తోంది.

-సూరంపూడి వీరభద్రరావు

సెల్ : 9393949345


దక్షిణ మధ్య రైల్వే

దక్షిణ మధ్య రైల్వే యొక్క టెండరు నోటీసులలోని వివరములు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in నందు కూడా చూడవచ్చును.

ఈ-టెండరు నోటీస్ నెం. 427/ డిఆర్ఎం/డబ్ల్యు/జిఎన్‌టి ఆఫ్ తేది : 25-01-2024

దిగువ సంతకం చేసిన వారు దిగువ తెలిపిన పనుల కొరకు 19-02-2024 గం. 15:30ల వరకు ఈ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

వ.నెం.: 1. టెండరు ఐడి : 2647 ఎస్ఆర్. డిఇఎన్/డిఇఎన్ : నార్త్ 24 పని వివరణ: SW (i) ఎడిఇఎన్/ఎస్ఎల్‌డిఒ పరిధిలో స్టేషన్ భవనముల యొక్క పరిసర ప్రాంతముల అభివృద్ధి పనులు. SW (ii) ఎడిఇఎన్/ఎస్ఎల్‌డిఒ పరిధిలో స్టేషన్ భవనముల వద్ద బస్ టైపు 'లో రూఫ్' షెల్టర్లు మరియు సీఓపీల ఏర్పాటు. SW (iii) ఎడిఇఎన్/ఎస్ఎల్‌డిఒ పరిధిలో అన్ని స్టేషన్ భవనములు, ప్లాట్‌ఫారముల వద్ద గల పురుషుల టాయిలెట్లు, మహిళల టాయిలెట్లు మరియు దివ్యాంగుల టాయిలెట్లకు అభివృద్ధి పనులు. అంచనా విలువ రూ. 2,99,65,028/- బిడ్ సెక్యూరిటీ : 2,99,800/-

వ.నెం.: 2. టెండరు ఐడి : 2648 ఎస్ఆర్. డిఇఎన్/డిఇఎన్ : నార్త్ 24 పని వివరణ: SW (i) ఎడిఇఎన్/నార్త్ పరిధిలో స్టేషన్ భవనముల యొక్క పరిసర ప్రాంతముల అభివృద్ధి పనులు. SW (ii) ఎడిఇఎన్/నార్త్ పరిధిలో స్టేషన్ భవనముల వద్ద బస్ టైపు 'లో రూఫ్' షెల్టర్లు మరియు సీఓపీల ఏర్పాటు. SW (iii) ఎడిఇఎన్/నార్త్ పరిధిలో అన్ని స్టేషన్ భవనములు, ప్లాట్‌ఫారముల వద్ద గల పురుషుల టాయిలెట్లు, మహిళల టాయిలెట్లు మరియు దివ్యాంగుల టాయిలెట్లకు అభివృద్ధి పనులు. అంచనా విలువ రూ. 1,85,12,552/- బిడ్ సెక్యూరిటీ : 2,42,600/-

1. ఈ-బిడ్లు ఆన్‌లైన్ ద్వారా సమర్పించుటకు చివరి తేది : 19-02-2024 గం. 15.30 వరకు పూర్తి వివరముల కొరకు మా వెబ్‌సైట్ www.ireps.gov.in సందర్శించండి.
2. ఏదైనా తదుపరి సమాచారం/సవరణలు మా ఈ పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయబడును.

A0100 డివిజనల్ రైల్వే మేనేజర్, పనులు, గుంటూరు

టెండరు షరతులు/వివరాలు/ నిబంధనలు, మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in లేదా http://www.scr.indianrailways.gov.in ను సందర్శించండి.


## డీఎఫ్ఓ లక్ష్మణరావుకు ఉత్తమ సేవా పురస్కారం




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రిపబ్లిక్ డే సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా రిపబ్లిక్ వేడుకలు జరిగాయి. జిల్లా కలెక్టర్ పటాన్ రవిశెట్టి, జిల్లా ఎస్పీ మురళీకృష్ణ తో కలిసి జిల్లాలో ఉన్న అన్ని వివిధ శాఖ అధికారులకు ఉత్తమ సేవా పథకం అవార్డు లను పంపిణీ చేశారు. అనకాపల్లి జిల్లా ఫారెస్ట్ డీఎఫ్ వొ లక్ష్మణరావు కు కలెక్టర్, ఎస్పీ , అవార్డును ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేశారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని లక్ష్మణరావు కలెక్టర్,ఎస్పీకి ఉన్నత అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## తెలుగుదేశం బీసీల పుట్టినిల్లు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఇంచార్జ్ బోనెల విజయ్ చంద్ర ఆధ్వర్యంలో, బైపాస్ రోడ్డు తెలుగుదేశం పార్టీ కార్యలయంలో జయహో బీసీ సదస్సు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.బీసీలకు తుంగలో తొక్కిన వైసీపీ ప్రభుత్వం, బీసీలకు వైసీపీ ప్రభుత్వం అయాంలో బీసీలకు న్యాయం జరగలేదు, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అందరికి న్యాయం జరిగింది,తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బీసీలకు మళ్ళీ పెద్దపీట వేస్తోంది. బొనెల విజయ చంద్ర ఈ కార్యక్రమానికి హాజరైన పార్వతీపురం నియోజకవర్గం పట్టణ, మండల వారిగా బీసీలు నాయకులు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు మహిళా మణులు తెలుగుదేశం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్వతీపురం మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి,అరుకు పార్లమెంటు ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట్ నాయుడు , ఐటిడిపి కోఆర్డినేటర్ బార్నాల సీతారాం , పట్టణ జనరల్ సెక్రటరీ మజ్జి వెంకటేష్ ,నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రవి , మండల పార్టీ అధ్యక్షులు బోను దేవి చంద్రమౌళి ప్రధాన కార్యదర్శి గోరజాన చంద్రమౌళి, టిడిపి నాయకులు పోలా సత్యనారాయణ ,ఐటిడిపి అధ్యక్షులు కోరాడ నారాయణ రావు , పట్టణ పార్టీ అధ్యక్షులు గుంట్రెడ్డి రవి కుమార్ ,డాక్టర్ గరిమెళ్ళ భాను ప్రసాద్ ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కుటుంబ సభ్యులు అభిమానులు తెలుగుదేశం పార్టీ మహిళా మణులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## డైట్ కళాశాలలో ప్రారంభమైన వెబినార్




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో డైట్ సి ఎస్ ఐ స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో "రీథింకింగ్ క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్" అండ్ "ఫండమెంటల్స్ అఫ్ ఐఓటి అండ్ ఇండస్ట్రీ ట్రెండ్స్" పై వెబినార్ నిర్వహించబడింది. ఈ వెబినారులో డాక్టర్ . స్వామినాధన్ మణికంధన్ ట్రైనర్ ఇన్ సాఫ్ట్ స్కిల్స్ , మేనేజింగ్ డైరెక్టర్ అఫ్ ఎం/స్ పెంటగోన్ రూజ్ట్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ , మాట్లాడుతూ ఆవిష్కరణ అనేది వ్యాపార ఆలోచనలలో ఒకటి మరియు సృజనాత్మకత అనేది మనకు తెలిసిన వాటిపై ఆధారపడి ఉంటుంది మరియు కొత్త ఆలోచనలను రూపొందించడానికి పాత ఆలోచనలను ఎలా ఉపయోగిస్తాము ఆవిష్కరణలు మానవ పురోగతికి ఉత్ప్రేరకాలు. సైన్స్ అండ్ టెక్నాలజీ నుండి కళలు మరియు సంస్కృతి వరకు ప్రతి డొమైన్ మరియు సెక్టార్‌లో ఆవిష్కరణలను కనుగొనవచ్చు. ఆవిష్కరణలు వ్యక్తిగత చాతుర్యం యొక్క ఫలితం మాత్రమే కాదు, సహకారం, ప్రయోగాలు వైఫల్యాల నుండి నేర్చుకోవడం కూడా. ఆవిష్కరణలకు ఉత్సుకత, రిస్క్ తీసుకోవడం మరియు కొత్త ఆలోచనలకు బహిరంగతను ప్రోత్సహించే అనుకూలమైన వాతావరణం అవసరం అని తెలిపారు. పెంటగోనా రగ్గడ్ గారు డైట్ కాలేజీలోని అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లను అందిస్తానని ప్రకటించారు. విద్యలంకార్ నిడమర్తి మాట్లాడుతూ డేటా మార్పిడి మరియు ఆటోమేషన్‌ను సులభతరం చేయడానికి ఇంటర్నెట్ ద్వారా రోజువారీ వస్తువుల ఇంటర్‌కనెక్ట్‌గా వివరించే ఐ.ఓ.టి యొక్క ప్రాథమిక భావనలపై చర్చతో వెబ్‌నార్ ప్రారంభమైంది. %×శీ% సెన్సార్లు మరియు పరికరాలు వ్యవసాయ పద్ధతులు, స్మార్ట్ నగరాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో ఆప్టిమైజ్ చేయబడిన రోగి పర్యవేక్షణ, మెరుగైన లాజిస్టిక్స్ నిర్వహణ మరియు పట్టణ పరిసరాలలో మెరుగైన ఇంధన సామర్థ్యాన్ని విప్లవాత్మకంగా మార్చాయి. సైబర్ బెదిరింపులు మరియు ఎల్ ఓ టి పరికరాలను రక్షించడానికి భద్రతా చర్యల యొక్క ప్రాముఖ్యతను వెబినారులో వివరించటం జరిగింది. విద్యార్థులు తమ యొక్క సందేహాలను స్పీకర్స్ నీ అడిగి నివృత్తి చేసుకున్నారు మరియు ఇలాంటి వెబినార్స్ నిర్వహించటం వలన మాలోని నైపుణ్యతని పెంచుకుంటాం అని విద్యార్థులు తెలిపారు . డైట్ కళాశాల చైర్మన్ దాడి. రత్నాకర్ మాట్లాడుతూ సి.ఎస్.ఐ స్టూడెంట్ చాప్టర్ అన్ని రకాల ఈవెంట్స్ నిర్వహిస్తునందుకు అభినందించారు . డైట్ వెబినార్ లో సి.ఎస్.ఐ కోఆర్డినేటర్ ఆర్.స్వప్న , సి.ఎస్.ఐ కన్వీనర్ డాక్టర్ .సుజాత , డైట్ అన్ని బ్రాంచెస్ విభాగాధిపతులు , ప్రిన్సిపాల్ ఆర్. వైకుంఠరావు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రియా రామ్ కి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు

**పరవాడ, (విశాఖ సమాచారమ్):** సంక్రాంతి సంబరాల్లో భాగంగా రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో రియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై సురేష్, విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ భక్షి, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కబాడీ, వాలీబాల్, కోకో, ముగ్గులు, సంస్కృతిక, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు ,వ్యక్తిగత మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవీఎన్ రావు, రియా ఫౌండేషన్ చైర్మన్ ఎండి రాజు, పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురం నియోజకవర్గం బిజెపి కన్వీనర్ సొండి సంజీవ్ మాస్టారు బలిజిపేట మండలంలో పార్వతిపురం మన్యం జిల్లా పార్వతీపురం నియోజకవర్గం బలిజిపేట మండలం వెంగాపురం, వంతరా ము గ్రామాలలో పార్వతిపురం నియోజకవర్గం అసెంబ్లీ బిజెపి కన్వీనర్ సొండి సంజీవి మాస్టారు పర్యటించారు.బూత్ కమిటీలు వేస్తూ, ప్రజలను కలిసి భారత ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ప్రజల కు అందుతున్న ప్రజా రంజకమైన సంక్షేమ పథకాలు ను వివరిస్తూ బిజెపి పార్టీ సాధిస్తున్న ఘనమైన చారిత్రాత్మకమైన సంఘటనలు గురించి బాల రామ ప్రాణ ప్రతిష్టకార్యక్రమం, భారత దేశ సాంకేతిక విజ్ఞాననైపుణ్య త ను చాటి చెప్పే చంద్రయాన్ -3 విజయవంతం మొదలగు అంశంలను వివరించారు. ఈ పర్యటనలో పార్వతిపురం మన్యం జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు సూచనల మేరకు పార్వతిపురం నియోజకవర్గ ము భూపతి రావు సీతానగరం మండల అధ్యక్షులు బాలు యాదవ్ , మత్రపు విజయ్ పాల్గొన్నారు.




# పచ్చిమిర్చితో ఆరోగ్యంగా గుండె



పురాతన కాలం నుంచి వంటల్లో పచ్చి మిర్చి వాడకం ఉంది. ఏది తింటే ఆరోగ్యానికి మంచిదో పెద్దలు అప్పుడే చెప్పారు. కానీ మనం వాటిని పట్టించుకోవడం లేదు. భారత దేశంలో పచ్చి మిర్చికి ఉండే డిమాండే వేరు. పచ్చి మిర్చి కారంగా ఉంటుందని చాలా మంది దాని వాడకాన్ని తగ్గించేస్తారు. వంటల్లో రుచిని తీసుకురావడంలో పచ్చిమిర్చి కూడా కీలక పాత్ర పోషిస్తుంది. వీటిని చట్నీల్లో, పప్పుల్లో, మసాలా వంటకాల్లో, పచ్చళ్లలలో ఎక్కువగా వినియోగిస్తూ ఉంటారు. నిజానికి పచ్చి మిర్చి వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటి గురించి తెలిస్తే పచ్చి మిర్చిని అస్సలు దూరం పెట్టరు.

ఆయుర్వేదంలో కూడా పచ్చి మిర్చి కొన్ని వ్యాధులను నయం చేయడానికి ఉపయోగిస్తూంటారు. అలాగే వీటిల్లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. పచ్చిమిర్చి జీర్ణ శక్తిని పెంచడంలో ముఖ్య పాత్ర వహిస్తుంది. కానీ ఏదైనా మితంగా వాడితేనే అమృతం. అంతకు మించి వాడితే విషమన్న సంగతి తెలుసుకోవాలి. కాబట్టి పరిమితి ప్రకారం ఏది వాడినా అది ఆరోగ్యానికి మంచే తప్ప కీడు చేయదు. ఈ విషయం పక్కకు పెడితే పచ్చి మిర్చితో ఎలాంటి శరీరానికి ఎలాంటి బెనిఫిట్స్ ఉన్నాయో, ఎలా వాడాలో తెలుసుకుందాం.

**గుండె ఆరోగ్యం:** పచ్చి మిర్చి రక్త పోటును, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. వీటిని మితంగా తీసుకుంటే మాత్రం గుండె పనితీరు ఆరోగ్యంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే రక్తంలో కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ లెవల్స్‌ను కంట్రోల్‌లోకి తీసుకువస్తుంది.

**విటమిన్లు పుష్కలంగా:** పచ్చి మిరపకాయల్లో విటమిన్లు ఏ, సి వంటికి మెండుగా ఉంటాయి. అలాగే దీనిలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి పచ్చి మిర్చి తింటే బాడీలో ఇమ్యూనిటీని కూడా పెంచుతుంది. విటమిన్ ఏ కంటి చూపును మెరుగు పరచడంలో హెల్ప్ చేస్తుంది. విటమిన్ సి చర్మ రక్షణకు సహకరిస్తుంది.

**యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఎక్కువ:** పచ్చి మిర్చిలో విటమిన్ సి, బీటా కెరోటిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఒత్తిడిని, ఆందోళనను ఎదుర్కొనడంలో సహాయం చేస్తుంది. అలాగే దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. వీటిల్లో ఉండే పోషకాలు చెమటను ప్రోత్సహిస్తాయి. ఈ చెమట వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్తాయి.

**నొప్పిని తగ్గిస్తుంది:** పచ్చి మిరపకాయలో ఉండే కొన్ని రకాల సమ్మేళనాలు నొప్పిని తగ్గించే లక్షణాలను కలిగి ఉంటాయి. వీటిని ఎక్కువగా నొప్పిని తగ్గించే క్రీములు, ఆయింట్‌మెంట్లలో ఉపయోగిస్తారు. ముఖ్యంగా ఆర్థరైటీస్, న్యూరోపతిలో నొప్పిని తగ్గించడంలో పచ్చి మిర్చి సహాయ పడుతుంది.

# ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మూన్‌మిల్క్

మూన్ మిల్క్ పేరు మీరు ఎప్పుడైనా విన్నారా? మూన్ మిల్క్ అంటే లేటెస్ట్ ట్రెండ్ అనుకుంటారేమో కానీ ఇది పురాతనమైన ఆయుర్వేద పానీయం. మూన్ మిల్క్ వాత, పిత్త, కఫ దోషాలను సమతుల్యం చేస్తుందని ఆయుర్వేదం చెబుతుంది. అసలు మూన్ మిల్క్ అంటే ఏమిటి? దీన్ని ఎలా తయారు చేస్తారు, దీని ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

**మూన్ మిల్క్ అంటే?**

మూన్ మిల్క్‌ను ప్రత్యేకంగా ఆవు పాలతో తయారు చేస్తారు. మీకు కావాలంటే బాదం, సోయా, ఓట్స్ పాలతోనూ తయారు చేసుకోవచ్చు. ఈ పాలలో దాల్చినచెక్క, ఏలకులు, పసుపు వంటి ఔషధ గుణాలు మెండుగా ఉండే ఆయుర్వేద మూలికలు ఉంటాయి. పసుపు, మూన్ మిల్క్‌కు అందమైన బంగారు రంగును ఇస్తుంది. అలాగే దీనిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్, యాంటీవైరల్ గుణాలు ఈ పాల సుగుణాలను మరింత పెంచుతాయి.

**నిద్ర మెరుగుపరుస్తుంది**

మూన్ మిల్క్ నిద్రను ప్రోత్సహిస్తుంది, ప్రశాంతమైన నిద్రను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ పాలలో అమైనో యాసిడ్ ట్రిప్టోఫాన్ ఉంటుంది. ఇది సెరోటోనిన్, మూడ్-స్టెబిలైజింగ్ హార్మోన్, ఇది నిద్రకు కారణమైన మెలటోనిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. మీరు నిద్రలేమితో బాధపడుతుంటే రాత్రి నిద్రపోయే ముందు ఈ పాలు తాగితే మేలు జరుగుతుంది.

**ఒత్తిడి తగ్గుతుంది:** మూన్ మిల్క్‌లో ప్రసిద్ధ ఆయుర్వేద మూలికైన అశ్వగంధ ఉంటుంది. ఇది శరీరంలో కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తాయి, తద్వారా ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మీకు స్ట్రెస్ ఎక్కువైతే మూన్ మిల్క్ ఎంతో సహాయ పడుతుంది.

**రోగనిరోధక శక్తి మెరుగుపరుస్తుంది:** మూన్ మిల్క్‌లో అల్లం, పసుపు వంటి సుగంధ ద్రవ్యాలు ఉంటాయి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను అధికంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను మెరుగు పరుస్తాయి. వర్షాకాలం ఈ డ్రింక్ తాగితే మీ ఇమ్యూనిటీని బూస్ట్ చేసుకోవచ్చు.

**జీర్ణక్రియ మెరుగుపరుస్తుంది:** మూన్ మిల్క్‌లో వేసే యాలకులు, దాల్చిన చెక్క దాని రుచిని పెంచడమే కాదు, జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తాయి. ఈ మసాలాలు అజీర్ణం, ఉబ్బరం, గ్యాస్ సమస్యలకు చెక్ పెడతాయి. మూన్ మిల్క్‌ను భోజనం చేసిన తర్వాత తాగితే జీర్ణవ్యవస్థ



సక్రమంగా పనిచేస్తుంది.

**ఎలా తయారు చేసుకోవాలి?** మూన్ మిల్క్ తయారు చేసుకోవడం చాలా సులభం. ఒక గ్లాసు పాలలో అర టీస్పూన్ పసుపు, చిటికెడు దాల్చిన చెక్క, యాలకుల పొడి వేయండి. దీనిలో మర్చిపోకుండా ఒక టీస్పూన్ అశ్వగంధ పొడిని కలపండి. ఆ తర్వాత చిన్న అల్లం ముక్క వేయండి. దీన్ని స్టౌవ్ మీద పెట్టి కొంతసేపు మరిగించండి. ఆ తర్వాత వేడి వేడిగా మూన్ మిల్క్‌ను ఎంజాయ్ చేయండి.

# జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారా?

## ఈ 5 డ్రై ఫ్రూట్స్ తీసుకున్నారంటే సమస్య పరార్



**ఎండిన అలుబుఖారా:** ప్లమ్ ఫ్రూట్ లేదా అలుబుఖారా పండ్లు మలబద్ధకం, ఎసిడిటీ సమస్యలను నయం చేయడంలో మెరుగ్గా పనిచేస్తాయి. ఫైబర్ పుష్కలంగా ఉన్న ఈ పండ్లను తీసుకుంటే రక్తంలో షుగర్ లెవెల్స్ కూడా కంట్రోల్‌లో ఉంటాయి.

**అంజీర్:** అంజీర్ లేదా అత్తి పండ్లు ఫైబర్ రిచ్ ఫుడ్. ఫలితంగా మీరు అన్ని రకాల జీర్ణ సమస్యల నుంచి తేలికగా ఉపశమనం పొందవచ్చు. అలాగే వీటిల్లో ఫైబర్ మాత్రమే కాక ప్రోటీన్, కాల్షియం, ఐరన్, జింక్, మెగ్నీషియం వంటి ఆరోగ్యానికి మేలు చేసే ఇతర పోషకాలు కూడా ఉన్నాయి.

**ఖర్జూరం:** ఖర్జూరాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఫైబర్‌తో పాటు విటమిన్ సి, విటమిన్ బి వంటి పలు విటమిన్లు ఉన్నందున ఖర్జూరాలు మలబద్ధకం, అజీర్తి సమస్యలకు చెక్ పెడతాయి. ఇంకా దగ్గు, జలుబు, జ్వరం వంటి సమస్యలు మీ దరిచేరనీయకుండా రోగనిరోధక శక్తిని మెరుగు పరుస్తాయి.

**బ్లాక్ రైసిన్స్:** నల్ల ఎండుద్రాక్ష లేదా బ్లాక్ రైసిన్స్‌ని నీటిలో నానబెట్టి తీసుకుంటే జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లతో పాటు పలు విటమిన్లను కలిగిన బ్లాక్ రైసిన్స్ మల బద్దకం, కడుపు మంట, అజీర్తి వంటి జీర్ణ సమస్యలను నివారించడమే కాక రోగనిరోధక శక్తిని, జుట్టు పోషణను పెంచుతుంది.

**డ్రై ఆప్రికాట్:** అప్రికాట్‌లో ఫైబర్, విటమిన్ సి, ఐరన్ వంటి పోషకాలు ఉన్నందున వీటిని తీసుకోవడవం ఆరోగ్యానికి మంచిదే. అయితే జీర్ణ సమస్యలు ఉన్నవారు డ్రై అప్రికాట్స్ తీసుకోవడం వల్ల మలబద్ధకం, అజీర్తి, ఎసిడిటీ సమస్యలు దూరమవుతాయి. అలాగే ఐరన్ కారణంగా రక్తహీనత నుంచి బయట పడవచ్చు.

# కాకరతో డయాబెటీస్ మాత్రమే కాదు ఇంకా ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెట్టవచ్చు



మనం నిత్యం వంట గదిలో ఉపయోగించే వాటిల్లో కాకర కాయ ఒకటి. కాకరకాయ పేరు ఎత్తగానే అమ్మో కాకరకాయ చేదు అంటూంటారు. కాకరకాయని ఎంత రుచిగా చేసినా కూడా దీన్ని ఎవరూ పట్టించుకోరు. కానీ ఇందులో ఉండే ఔషధ గుణాలతో ఎన్నో రకాల దీర్ఘకాలిక వ్యాధులను, అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చన్న విషయం చాలా మందికి తెలీదు. నాలుకతో రుచిని చూస్తాం కానీ డయాబెటీస్‌తో పాటు కాకరకాయని సరిగ్గా వాడితే చాలా విధాలుగా ప్రయోజనం చేకూరుస్తుంది.

కాకరలో విటమిన్ ఏ, బీ, సీ, బీటా కెరోటిన్ వంటి విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. అలాగే జింక్, మాంగనీస్, పొటాషియం, ఐరన్, మెగ్నీషియం వంటివి కూడా మనకు లభిస్తాయి. కాకరకాయను క్రమం తప్పకుండా తీసుకుంటే ఎన్నో రకాల సమస్యలకు చెక్ పెట్టేయవచ్చు. సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు, జ్వరాలను కూడా దరి చేరనీయదు కాకరకాయ. అంత రోగ నిరోధక శక్తి కాకర కాయలో ఉంది.

**బ్లడ్ షుగర్ ను కంట్రోల్ లో చేస్తుంది:** చేదుగా ఉన్న వాటిని తింటే మన శరీరంలో న్యూరో సెంటర్ మెకానిజంపై ప్రభావం చూపిస్తుంది. దీంతో చేదు ఐటెమ్స్ వంటి వాటిని తీసుకుంటే హార్మోన్స్ లో రెస్పాన్స్ వస్తుంది. ఈ విధంగా బ్లడ్ షుగర్ లెవల్స్ మారుతూ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే కాకర కాయ జ్యూస్ తాగితే డయాబెటీస్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు.

**క్యాన్సర్ రిస్క్ ను తగ్గిస్తుంది:** చేదుగా ఉందని పక్కన పెట్టకుండా ముందే కొద్ది కొద్దిగా కాకర కాయను తినడం అలవాటు చేసుకుంటే చాలా బెటర్. మన ఆరోగ్యం గురించి మనమే శ్రద్ధ తీసుకోవాలి. కాకర కాయను తినడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల్లో ఒకటైన క్యాన్సర్ ను కూడా తగ్గిస్తుంది.

**గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది:** మనకు ప్రకృతి ప్రసాదించిన నేచురల్ ఫుడ్స్‌లో కాకరకాయ ఒకటి. కాకరను తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్‌ను లెవల్స్‌ను తగ్గిస్తుంది. అంతే కాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో ముఖ్య పాత్ర వహిస్తుంది కాకర. అలాగే బ్లడ్ సర్క్యూలేషన్ కూడా మెరుగు పరుస్తుంది.

**బరువును తగ్గించుకోవచ్చు:** కాకర కాయతో అధిక బరువు కూడా చెక్ పెట్టవచ్చు. కాకర కాయలో ఉండే ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. దీంతో తిన్న ఆహారం పేరుకుపోకుండా త్వరగా జీర్ణం అవుతుంది. అలాగే నడుము చుట్టూ ఉన్న కొవ్వును కూడా కరిగిస్తుంది కాకర.

# చర్మం మరియు జుట్టుకు బొప్పాయి అందించే బ్యూటీ బెనిఫిట్స్



మీ చర్మం మరియు జుట్టు సంరక్షణకు సహజ చికిత్సలు ఉత్తమ మార్గం. సింథటిక్ కెమికల్ బేస్డ్ ప్రొడక్ట్స్ వాడే బదులు నేచురల్ ప్రొడక్ట్స్ వాడటం మంచిది. సహజ పదార్థాలు మీ చర్మం మరియు జుట్టును నిర్వహించడానికి సహాయపడతాయి. అందువలన, మీరు ఎటువంటి దుష్ప్రభావాలను అనుభవించలేరు. కానీ సింథటిక్ ఉత్పత్తులు అకాల వృద్ధాప్యం మరియు జుట్టు రాలడం వంటి అనేక దుష్ప్రభావాలను కలిగిస్తాయి. బొప్పాయి మీ జుట్టు మరియు చర్మాన్ని సంరక్షించగల ఒక పండు.

మీ చర్మం మరియు జుట్టుకు పోషణ కోసం ఇక్కడ కొన్ని సాధారణ బొప్పాయి ఫేస్ మరియు హెయిర్ మాస్క్‌లు ఉన్నాయి. ఈ మాస్క్‌లు చర్మం మరియు జుట్టును ఎక్స్‌ఫోలియేట్ చేయడానికి, మాయిశ్చరైజ్ చేయడానికి, ఉపశమనానికి మరియు బలోపేతం చేయడానికి సహాయపడతాయి.

**జుట్టు మరియు చర్మం కోసం ప్రయోజనాలు:** బొప్పాయిలో ఉండే పెపైన్ చర్మ సంరక్షణలో అద్భుతంగా సహాయపడుతుంది. దీన్ని హెయిర్ ప్యాక్ గా అప్లై చేస్తే, ఇది చనిపోయిన చర్మ కణాలను తొలగిస్తుంది, రంధ్రాలను అన్‌క్లాగ్ చేస్తుంది మరియు నిస్తేజంగా ఉన్న మరియు మొటిమలను నివారిస్తుంది. అదనంగా, బొప్పాయిలోని విటమిన్ సి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా కాపాడుతుంది. డార్క్ స్పాట్‌లను కాంతివంతం చేస్తుంది మరియు కొల్లాజెన్ మరియు ఎలాస్టిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. బొప్పాయి యొక్క ప్రయోజనాలు జుట్టు సంరక్షణకు కూడా విస్తరించాయి. బొప్పాయి మృతకణాలను తొలగించడం ద్వారా మీ చర్మ రూపాన్ని మెరుగు పరుస్తుంది మరియు ఇందులోని అధిక బీటా కెరోటిన్ కంటెంట్ చర్మపు రంగును మెరుగుపరుస్తుంది. అదనంగా, ఇది చర్మానికి తేమను అందించి అందంగా మార్చుతుంది.

**బొప్పాయి మరియు మలయ్ ఫేస్ ప్యాక్:** బొప్పాయిలో పెపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది, ఇది చనిపోయిన చర్మ కణాలను ఎక్స్‌ఫోలియేట్ చేయడం ద్వారా ప్రకాశవంతమైన చర్మాన్ని ప్రోత్సహిస్తుంది. ఇందులోని విటమిన్ సి మరియు ఫోలేట్ కంటెంట్ చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. పాల నుండి తీసుకోబడిన (మలై) మీగడలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది. ఇది యవ్వనమైన, ప్రకాశవంతమైన చర్మాన్ని ఇస్తుంది మరియు చర్మంలో నీటిని నిలుపుకోవడం ద్వారా పొడిబారకుండా చేస్తుంది. ఈ ఫేస్ మాస్క్ చేయడానికి, మీరు కొంచెం బొప్పాయి గుజ్జును కలపాలి మరియు దానికి ఒక టేబుల్ స్పూన్ మలాయ్ కలపాలి. ఈ మిశ్రమాన్ని బాగా మిక్స్ చేసి ముఖానికి అప్లై చేసి 15-20 నిమిషాల పాటు అలాగే ఉంచి గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.

**బొప్పాయి మరియు తేనె ఫేస్ మాస్క్:** బొప్పాయి ఒక అద్భుతమైన సహజ ఎక్స్‌ఫోలియంట్. ఇది చనిపోయిన చర్మ కణాలను కరిగించి, రంధ్రాలను అన్‌లాగ్ చేస్తుంది మరియు నిస్తేజాన్ని నివారిస్తుంది. తేనె చర్మానికి అద్భుతమైన పదార్థం. ఎందుకంటే ఇది సహజమైన మాయిశ్చరైజర్. అంటే చర్మంలో తేమను ఆకర్షిస్తుంది మరియు నిలుపుకుంటుంది. ఈ మాస్క్ చేయడానికి, పావు కప్పు పండిన బొప్పాయిని మెత్తగా చేసి, దానికి రెండు టేబుల్ స్పూన్ల తేనె కలపాలి. తర్వాత దీన్ని ముఖానికి రాసుకుంటే ఫలితం ఉంటుంది.

**బొప్పాయి మరియు పసుపు ముఖానికి మాస్క్:** బొప్పాయి మరియు పసుపు ఫేస్ మాస్క్ మీ చర్మానికి అనేక ప్రయోజనాలను అందించగల సమర్థవంతమైన సహజ నివారణ. పసుపు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఇది ఫ్రీ రాడికల్స్ తొలగిస్తుంది. దాంతో చర్మాన్ని రక్షిస్తుంది, చర్మంలో వాపు మరియు హైపర్పిగ్మెంటేషన్ తగ్గిస్తుంది. బొప్పాయి మరియు పసుపు కలయికను ప్యాక్‌గా ఉపయోగించడం వల్ల చర్మాన్ని పునరుజ్జీవింపజేస్తుంది మరియు యవ్వనంగా మెరుస్తుంది. రెగ్యులర్ వాడకంతో, ఈ ముసుగు మీ చర్మం యొక్క మొత్తం రూపాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**బొప్పాయి మరియు అలోవెరా హెయిర్ మాస్క్:** బొప్పాయి జుట్టుకు మేలు చేస్తుంది, ఎందుకంటే ఇది తలలోని మొటిమలను తొలగించి ఆరోగ్యంగా ఉంచుతుంది. కలబంద జుట్టుకు చక్కని పదార్థం. ఎందుకంటే ఇది జుట్టును తేమగా, మృదువుగా మరియు బలోపేతం చేస్తుంది. ఈ ఫేస్ మాస్క్ చేయడానికి, పావు కప్పు పండిన బొప్పాయిని మెత్తగా చేసి, రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్‌ను కలపండి. ఈ మిశ్రమాన్ని మీ జుట్టు మరియు తలకు పట్టించి 15-20 నిమిషాల తర్వాత కడిగేయండి.

**బొప్పాయి మరియు అరటి హెయిర్ మాస్క్:** అరటిపండ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది, ఇది జుట్టును బలపరుస్తుంది. జుట్టుకు పోషణనిచ్చే విటమిన్లు మరియు మినరల్స్ కూడా ఇందులో ఉంటాయి. ఈ మాస్క్‌ను తయారు చేయడానికి, పావు కప్పు పండిన బొప్పాయి మరియు పావు కప్పు పండిన అరటిపండును మాష్ చేయండి. ఈ మిశ్రమాన్ని మీ జుట్టు మరియు తలపై అప్లై చేసి 15-20 నిమిషాల పాటు అలాగే ఉంచి తేలికపాటి షాంపూతో మీ జుట్టును కడగాలి.

బొప్పాయి ఒక బహుముఖ పండు. ఇది చర్మం మరియు జుట్టు కోసం అనేక సహజ మార్గాలలో ఉపయోగించవచ్చు. పైన ఇవ్వబడిన ఫేస్ మరియు హెయిర్ మాస్క్‌లు తయారు చేసుకోవడం సులభం మరియు సులభంగా లభించే పదార్థాలతో ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. కాబట్టి, తదుపరిసారి మీ చర్మ సంరక్షణ మరియు జుట్టు సంరక్షణ దినచర్యలో పండిన బొప్పాయిని ఉపయోగించడానికి సంకోచించకండి.

# మహిళలల్లో గుండెపోటు రావడానికి ఇవి కూడా కారణాలు

నేటి వేగవంతమైన ప్రపంచంలో, ప్రతిరోజూ కొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయి మరియు అభివృద్ధి చెందుతాయి. అయితే, శతాబ్దాలుగా మానవాళిని భయపెడుతున్న ఒక వ్యాధి గుండెపోటు. గుండెపోటు అనేది వృద్ధులలో మాత్రమే వచ్చేది, కానీ ప్రస్తుత ఆహారపు అలవాట్లు మరియు ఒత్తిడితో కూడిన సమాజంతో, గుండె పోటులు 30 సంవత్సరాల వయస్సు నుండి ప్రారంభమవుతాయి. కరోనా అనంతరం గుండెపోటు బారిన పడుతున్న మహిళల సంఖ్య 35 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి.

ఆహారం, పని భారం మరియు వంశపారంపర్యం వంటి గుండెపోటుకు అనేక కారణాలు ఉన్నాయి. పురుషుల కంటే మహిళలకు గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. కొన్ని రోజుల క్రితం బాలీవుడ్ నటి సుస్మితాసేన్ తనకు గుండెపోటు వచ్చిందని చెప్పింది. అలాగే కన్నడ నటుడు విజయ రాఘవేంద్ర సతీమణి స్పందన కూడా గుండెపోటుతోనే మరణించింది. వీళ్లిద్దరి వయసు యాభై ఏళ్ల లోపే. దీన్నిబట్టి మహిళలు కూడా గుండెపోటు విషయంలో అలసత్వం చూపించ రాదని తెలుస్తోంది.

**మహిళల్లో గుండె పోటు లక్షణాలు:** సాధారణంగా గుండెపోటుకు ముందు వచ్చే లక్షణం ఛాతీలో నొప్పి రావడం, ఛాతీ బిగుతుగా ఊపిరాడనట్లు కావడం. కానీ ఒక్కోసారి ఎలాంటి లక్షణాలు కనబడ కుండానే గుండె పోటు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి చిన్న చిన్న అసౌకర్యాలు ఉన్నా కూడా అలసత్వం వహించకుండా జాగ్రత్త పడటం చాలా ముఖ్యం.

మెడ, దవడ, భుజాలు, ఛాతీ భాగంలో నొప్పిగా, అసౌకర్యంగా అనిపిస్తే తేలిగ్గా తీసుకోకూడదు.

అలాగే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నా, ఒక చెయ్యి లేదు రెండు చేతులు నొప్పిగా అనిపిస్తాయి.

వికారంగా ఉండి, వాంతులు వస్తున్నట్టు అనిపిస్తాయి.

ఎలాంటి కారణం లేకుండా చెమటలు పట్టినా, విపరీతమైన అలసట, నీరసం అనిపిస్తుంది.

గుండెల్లో మంట ఉన్నా, ఆహారం అరగకపోయినా చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇవన్నీ కూడా గుండెపోటు లక్షణాలు గానే చెబుతున్నారు వైద్య నిపుణులు.



**మహిళల్లో గుండె పోటుకు కారణాలు**

స్పాంటేనియస్ కరోనరీ ఆర్టరీ డిసెక్షన్ అనేది రక్తనాళంలో అడ్డుపడటం వల్ల ఏర్పడే అత్యవసర పరిస్థితి. ఫలితంగా, రక్త ప్రసరణ తగ్గిపోతుంది లేదా పూర్తిగా నిరోధించబడుతుంది, ఇది వెంటనే గుండెపోటుకు అవకాశాలను పెంచుతుంది. ముఖ్యంగా కొత్తగా తల్లులైన స్త్రీలలో పురుషుల కంటే స్త్రీలు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారని తేలింది.

**ఒత్తిడి-ప్రేరిత:** కార్డియాలజిస్టులు దీనిని ఒత్తిడి-ప్రేరిత కార్డియోమయోపతి అని పిలుస్తారు. ఇది పురుషుల కంటే స్త్రీలను సులభంగా ప్రభావితం చేస్తుంది. స్త్రీలు సహజంగా పురుషుల కంటే ఎక్కువ భావోద్వేగాలకు లోనవుతారు. కుటుంబ సంబంధాలలో సమస్యలు, ప్రియమైన వారిని కోల్పోవడం మొదలైనవి వారిని అస్థిరపరుస్తాయి. ఈ పరిస్థితిలో, వారి గుండె రక్తాన్ని పంప్ చేయడానికి చాలా కష్టంగా ఉంటుంది. ఇది గుండె పోటుకు దారి తీస్తుంది. సకాలంలో మరియు సరైన చికిత్సతో, పూర్తిగా కోలుకునే అవకాశాలు ఉన్నాయి.

**అధిక బరువు:** అధిక బరువు ఉన్న స్త్రీలకు, ముఖ్యంగా పొత్తికడుపు చుట్టూ కొవ్వు అధికంగా ఉండటం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. దీని అర్థం సన్నగా ఉన్నవారికి గుండె జబ్బులు ఉండవని కాదు. అధిక రక్తపోటు మరియు కొలెస్ట్రాల్ మీరు సన్నగా ఉన్నప్పటికీ గుండెపోటుకు కారణమవుతుంది మరియు ధూమపానం చేసే మహిళలకు చాలా ఎక్కువ అవకాశం ఉంటుంది.

**మధుమేహం:** గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ప్రధాన కారణాలలో మధుమేహం ఒకటి. రక్తంలో ఎక్కువ చక్కెర ధమనులలో మంటను కలిగిస్తుంది, ఎందుకంటే ఇది రక్తంలో ఆక్సిజన్ స్థాయిలను తగ్గిస్తుంది. అదనంగా, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఊబకాయం మరియు అధిక రక్తపోటు మరియు అధిక కొలెస్ట్రాల్ కలిగి ఉంటారు. డాక్టర్ సహాయంతో మీ చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నించండి.

**మానసిక ఒత్తిడి:** గుండెను కాపాడుకోవడానికి శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఈ ఒత్తిడి మీకు గుండెపోటు వచ్చే అవకాశాలను రెట్టింపు చేస్తుంది. వ్యాయామం, ఆరోగ్య సంరక్షణ మరియు రోజువారీ దినచర్యలు మిమ్మల్ని అన్నింటికీ దూరంగా ఉంచుతాయి. ఈ పరిస్థితిలో, మీ గుండె సులభంగా దాడికి గురవుతుంది. వీలైనంత సంతోషంగా మరియు చురుకుగా ఉండటానికి ప్రయత్నించండి.

## సబ్ ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్, సయ్యద్ సలీమ్ కి సత్కారం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** గణతంత్ర దినోత్సవం సందర్భంగా అనకాపల్లి సబ్ ట్రజరీ సీనియర్ అకౌంటెంట్ సయ్యద్ సలీమ్ అనకాపల్లి జిల్లా కలెక్టరువారి సువర్ణ హస్తాలమీదుగా జిల్లా స్థాయి మెరిటోరియస్ పురస్కారం అందుకున్న సందర్భంగా అనకాపల్లి సబ్ ట్రజరీ (పశ్చిమం) ప్రాంగణంలో సయ్యద్ సలీమ్ ని అభినందిస్తూ, కళాశాలల విశ్రాంత అధ్యాపక సంఘం అనకాపల్లి వారు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్ర మానికి విశ్రాంత కళాశాలల సంఘం, అనకాపల్లి అధ్యక్షుడు డాక్టర్ రామ సత్యనారాయణ, అధ్యక్షత వహించి, సలీమ్ పెన్షనర్లకు అందించే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సాయిబాబా, కార్యదర్శి డాక్టర్ ఈశ్వర రావు, ట్రజరర్ రాజారావు, సభ్యులు డాక్టర్ చక్రపాణి, డాక్టర్ మారేశ్వర రావు, డాక్టర్ అశోక్ కుమార్.డాక్టర్ వాసుదేవ రావు, మురళీకృష్ణ, రాము నాయుడు, నరసింహారావు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. సన్మాన గ్రహీత సయ్యద్ సలీమ్ మాట్లా డుతూ, తాను తన ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నిర్వహిం చానని, తనకు ఈ పురస్కా లభించడం ఆనందదాయ కమని, దీనివలన పెన్షనర్ల పట్ల తన బాధ్యత మరింత పెరిగిందని, ఈ పురస్కారం లభించడానికి తమ జిల్లా ట్రజరీ అధికారిణి వి. లక్ష్మీ సుభాషిణి కి తన పట్ల వున్న విశ్వాసము, సహృదయతయే కారణ మని , తన పై అధికారిణికి తన పట్లచూపిన సహృద యతకు తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో స్టేట్ స్కేల్స్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష. కార్యదర్శి, కోశాధికారి లు జగన్నాథరావు, శర్మ , సభ్యులు శేషగిరిరావు, గాంధి, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఏడుగురిని బలిగొన్న స్కార్పియో కారు..



ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందారు. వేగంగా దూసుకొచ్చిన మహీంద్ర స్కార్పియో కారు ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆటో, ట్రాక్టర్, రెండు బైకులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 15 మందిలో ముగ్గురు ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందగా.. మరో నలుగురు ఆస్పత్రిలో మృతి చెందారు. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స కల్పిస్తున్నారు. అయితే స్కార్పియో కారులో ఉన్న వారంతా క్షేమంగా బయటపడ్డారు. ఈ ప్రమాదానికి సంబంధించిన షాకింగ్ దృశ్యాలు సమీపంలో ఓ దుకాణంలో ఏర్పాటు చేసిని సీసీటీవీ కెమరాలో రికార్డయ్యాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ బాలకృష్ణ రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు



**హైదరాబాద్:** ఆదాయానికి మించి అక్రమాస్తుల కేసులో హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెల్లడయ్యాయి. బాలకృష్ణ ఇల్లు సహా 18 చోట్ల ఏసీబీ ఇటీవల సోదాలు చేసి భారీగా స్థిర, చరాస్తులకు సంబంధించిన దస్త్రాలను గుర్తించింది. బాలకృష్ణ ఇంట్లో స్వాధీనం చేసుకున్న 50 స్థిర, చరాస్తులకు సంబంధించిన పత్రాలను పరిశీలించగా.. వాటి విలువ దాదాపు రూ.5 కోట్లు ఉంటుందని అంచనా. వాటితోపాటు సోదాల్లో రూ.99 లక్షల నగదు, నాలుగు కార్లు, రూ.8.26 కోట్ల విలువైన బంగారం, వెండి, వాచ్‌లు, ఫోన్లు, గృహోపకరణాలను సీజ్ చేసినట్లు రిమాండ్ రిపోర్టులో అధికారులు పేర్కొన్నారు. పలు ఇన్‌ఫ్రా కంపెనీల్లోనూ సోదాలు చేసినట్లు ఏసీబీ పేర్కొంది. "155 డాక్యుమెంట్ షీట్లు, 4 బ్యాంక్ పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నాం. ఇందుకు సంబంధించి బినామీలను విచారించాలి. ఇతర అధికారుల పాత్రపై దర్యాప్తు జరపాల్సి ఉంది. పీర్జాదిగూడలో రమాదేవి, జూబ్లీహిల్స్‌లో ప్రమోద్ కుమార్, మాదాపూర్‌లో సందీప్ రెడ్డి, బాచుపల్లిలో సత్యనారాయణ మూర్తి ఇళ్లు సహా మొత్తం 18 చోట్ల సోదాలు చేశాం" అని రిమాండ్ రిపోర్టులో ఏసీబీ వివరించింది.

# విశాఖ స్టీల్ అమ్మకం నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మకపు నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

ఈ సందర్భంగా జగదాంబ వద్ద గల సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎం.శ్రీనివాసరావు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామిలతో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ నూరుశాతం అమ్మాలని నిర్ణయించి నేటికి మూడేళ్లు అయ్యింది. 27-1-2021న కేంద్ర ప్రభుత్వ ఆర్థిక క్యాబినెట్ సబ్ కమిటీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మేలనే తప్పుడు నిర్ణయం చేసింది. ఆనాటి నుండి విశాఖస్టీల్‌ప్లాంట్ పోరాట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు సాగుతున్నాయి. కానీ కేంద్ర బిజెపి ప్రభుత్వం నేటికీ తమ నిర్ణయాన్ని ఉపసంహరించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి మినహా అన్ని రాజకీయపార్టీలూ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాయి. రాష్ట్ర అసెంబ్లీ విశాఖ స్టీల్‌ప్లాంట్ నూరుశాతం అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. విశాఖస్టీల్‌ప్లాంట్ వద్ద రాష్ట్రంలోని రాజకీయపార్టీలన్నీ బిజెపి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ భారీ సభ జరిగింది. జాతీయ కార్మిక సంఘాలన్నీ ఈ నిర్ణయాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. 550 రైతు సంఘాలకు నాయకత్వం వహిస్తున్న కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాలు సంయుక్తంగా విశాఖ బీచ్‌లో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భారీ సభ జరిగింది. పది కిలోమీటర్ల మానవహారం, యువతీ, యువకుల 5కే రన్ లాంటి వందకు పైగా భారీ కార్యక్రమాలు జరిగాయి. కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని అడ్డుకోకుండా గత మూడేళ్లు నాటకమాడింది. అలాగే రాష్ట్రంలోని గనులు లీజులు పునరుద్ధరించకుండా ద్రోహం చేసింది.

గత మూడేళ్ళలో కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మలేకపోయింది. అమ్మడానికి మొదటిదశలో చేయవలసిన విలువ కట్టడంలోనే విఫలమైంది. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గుండెకాయ అయిన బ్లాస్ట్‌ఫర్నేస్ మూడును రెండేళ్లు మూసివేసింది. 2020-21 సంరంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.915కోట్లు లాభాలు వచ్చినా కావాలనే ముడిసరుకు కొనడానికి నిధులు కేటాయించలేదు. గత సంవత్సరం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 2022-23 సం॥రంలో రూ.3900 కోట్లు భారీ నష్టం రావడానికి బాధ్యత కేంద్ర బిజెపి ప్రభుత్వానిదే. సొంతగనులు సమస్యను పరిష్కరించలేదు. 30సం॥ల నుండి స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు ఇవ్వకుండా దక్షిణకొరియా స్టీల్‌ను పోస్కో కంపెనీకి ఒరిస్సాలో ఉన్న ఉక్కుగనులు కేటాయించడం ఏ విధమైన దేశభక్తి?. సొంతగనులు కేటాయిస్తే విశాఖస్టీల్‌ప్లాంట్ దేశంలోనే ఉత్పత్తిలో లాభాలు ప్రథమ స్థానంలో ఉంటుంది. ఎలాగైనా ప్రైవేట్‌వారిని విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోకి దూర్చాలనే దుర్బుద్ధితో బ్లాస్ట్‌ఫర్నేస్.3కు ముడుసరుకుని సరఫరా చేసే నెపంతో ఉత్పత్తి చేసిన విశాఖ స్టీల్‌ను జిందాల్‌కు అప్పగించే ఒప్పందం చేయడం దుర్మార్గం. విశాఖస్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వరంగంలోనే స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో కలపడం ద్వారా విశాఖస్టీల్‌ప్లాంట్ గనుల సమస్యను శాస్వతంగా పరిష్కరించ వచ్చు. గత ఐదేళ్ళలో 5800 మంది అధికారులు, పర్మినెంట్ ఉద్యోగుల ఖాళీలను కావాలనే నింపకుండా స్థానికులకు అన్యాయం చేస్తున్నది. 22వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులకు బిజెపి ప్రభుత్వం ద్రోహం చేస్తున్నది. సముద్రతీరంలో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌వారికి అప్పగించడం ఆంధ్రరాష్ట్ర ప్రజలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. విశాఖస్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రజలు ముందుకు రావాలని కోరుతున్నాము.

బిజెపి కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ళలో ఒక్క భారీ పరిశ్రమను కూడా నిర్మించలేదు. గత ప్రభుత్వాలు నిర్మించిన భారీ ప్రభుత్వరంగ పరిశ్రమలు, గనులు, భూములు, సముద్రతీరాన్ని విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలకు అమ్మాలని నిర్ణయించడం దేశద్రోహం. దేశభక్తి ముసుగులో దేశ సంపదను ప్రైవేట్‌కు కట్టబెట్టడాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలి. మోడి విధానాలను, బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడమే సరైన పరిష్కారం.

## జనసేన పార్టీలో చేరిన గొర్రెలగొంది గ్రామం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పాడేరు గొర్రెలగొంది గ్రామస్తులతో సమావేశమైన జనసేనపార్టీ నాయకులు. ఈ సందర్బంగా పాడేరు జన సేన పార్టీ ఇన్చార్జ్ డా..వంపూరు గంగులయ్య గారితో స్థానిక గ్రామస్తులు గ్రామ సమస్యలైన తాగు నీటి, సాగునీటి సమస్యలు అధికంగా ఉందని తెలిపారు ఇదివరకెన్నాడు ఇటువంటి పాలన చూడలేదని కష్టబడి పిల్లలని చదివిస్తే వారికి సరైన ఉపాధికల్పన చెయ్యకుండా ఉత్త జాబ్ క్యాలెండర్లంటూ ఈ వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని వాపోయారు వారి సమస్యలు తెలుసుకున్న జనసేనపార్టీ ఇన్చార్జ్ గంగులయ్య మాట్లాడుతూ మీరు చెప్పిన సమస్యలే కాకుండా అనేక రకాలుగా రాష్ట్ర ప్రజానీకానికి అన్ని వర్గాల ప్రజలకు తీవ్రమోసం చేసింది వైసీపీ ప్రభుత్వమన్నారు.మన ప్రాంతంలో మన గిరిజన ప్రజలకు చేసిన మోసలలో ఒక ఉదాహరణ చెప్పదలుచుకున్నాను గత సంవత్సరం మార్చ్ 24 తేదీ యావత్ గిరిజన జాతికి చీకటి దినం మన గిరిజన జాతిని ఈ వైసీపీ గిరిజన ప్రజాప్రతినిధులు అమ్మ కానికి పెట్టిన రోజు సూటుకేసులు తీసుకుని గిరిజన అస్తిత్వం అమ్మిన రోజు ఈ విషయం గిరిజన ప్రజలు తెలుసుకోవాలి ఇంకా ఇప్పటికి సరైన మౌలిక సదుపాయాలు లేని గిరిజన గ్రామలేన్నో ఉన్నాయి, యువతకు ఉపాధి లేదు మన పిల్లల ఉపాధికి ఆయువుపట్టైన జీవో నెం3 ని రద్దు చేశారు.ఇలా అనేకరకలుగా అన్ని రంగాల్లో గిరిజన ప్రజలకు ఉచితాలు ఇస్తున్నామంటూ తడి గుడ్డతో గొంతు కోసే ప్రయత్నాలు చేస్తున్నారు మన అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఇంకోసారి మోసం చెయ్యడానికి సిద్ధమవుతున్నారు వైసీపీ చేసిన దగా, మోసాలు చెప్పాలంటే ఒక రోజు సరిపోదు వాళ్ళకి బుద్ధి చెప్పాలంటే కచ్చితంగా రానున్న ఎన్నికలలో ఓటు మాత్రమే సరైన ఆయుధం వచ్చే ఎన్నికలలో జనసేనపార్టీ, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి కి ఓటు వేసి వైసీపీ ని ఇంటికి సాగణంపాలి అందుకు మీ సహకారం కావాలన్నారు. ఈ సందర్భంగా జనసేనాని అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ ఆలోచన విధానానికి,జనసేనపార్టీ గిరిజనుల పట్ల అనుచరించే సంస్కరణలకు ఆకర్షితులై గ్రామస్తులు జనసేనపార్టీ లో చేరారు వారికి పాడేరు ఇన్చార్జ్ గంగులయ్య కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ చేరికలకు కృషిచేసిన పాడేరు మండల నాయకులు సుర్ల సుమన్,ముదిలి సుబ్బారావు,సతీష్ లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు మజ్జి సత్యనారాయణ,సీసాలి భూపాల్, సాలేబు అశోక్,తదితర నాయకులు స్తానిక గ్రామ యువత పెద్దయెత్తున పాల్గొన్నారు.



ఫొటోగ్రాఫర్ తెంటు శ్రీనివాస్ ప్రతిభకు మరో ప్రతిష్టాత్మక ప్రశంసా జ్ఞాపిక లభించింది. రిపబ్లిక్ డే సందర్భంగా జెండా వందన కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఈ. ఓ. గారు నన్ను ప్రశంసిస్తూ వారి చేతుల మీదుగా నాకు ప్రశంసా జ్ఞాపికను అందజేయటం జరిగింది. ప్రతిక్షణం స్వామి వారి సేవలో తెంటు శ్రీనివాస్ నా స్వామి ని నమ్మి కొలిచిన వారిని నిత్యం నీడలా కాపాడే స్వామి నా శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఇదంతా నా స్వామి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. **విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్)**

## సీఎం వైయస్ జగన్ నాయకత్వాన సమావేశానికి సిద్ధం



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో సిద్ధం సమావేశానికి నియోజకవర్గం నుంచి 100 బస్సులు, 20 కార్లలో తరలి వెళుతున్న వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సీఎం వైయస్ జగన్మోహన్రెడ్డి నాయకత్వాన శనివారం మధ్యాహ్నం భీమిలి మండలంలో జరగబోయే సిద్ధం ఉత్తరాంధ్ర జిల్లా కార్యకర్తల సమావేశం కార్యక్రమానికి పార్వతీపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో పెద్ద యెత్తున వైసీపీ శ్రేణులు తరలి వెళ్ళడం జరుగుతుంది. ఈ సమావేశానికి పార్వతీపురం నుంచి 100 బస్సులు మరియు 20 కార్లలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ తరలి వెళ్తుండగా ఎమ్మెల్యే గారు అభివాదం చేస్తూ అంతా జాగ్రత్తగా భీమిలి సభాస్థలం వద్దకు చేరుకోవాలని తెలుపడం జరిగినది. ఈ సమావేశానికి వెళ్తున్న వేలాదిమంది వైసీపీ శ్రేణులు అందరికీ కూడా ఎమ్మెల్యే బోజన ఏర్పాట్లు చేయించడంతో పాటు ఎవరికీ ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగినది.

## వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదు ప్రారంభం

### పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ల పెడరేషన్, ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ ల అసోషియేషన్ విశాఖ అర్బన్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోద కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. డైమండ్ పార్క్ సమీపంలోని ఒక హెూటల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అర్బన్ యూనిట్ అధ్యక్షులు పి నారాయణలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వర్కింగ్ జర్నలిస్టులకు రెన్యువల్ సభ్యత్వ నమోదు కార్డులు అందజేశారు. అలాగే నూతన సభ్యత్వ కార్డులు కూడా అందజేసారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు, నారాయణలు మాట్లాడుతూ జర్నలిస్టులు సంక్షేమానికి తమ యూనియన్ లు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తమ పరిధి మేరకు జర్నలిస్టులకు సహాయం అందిస్తామన్నారు. ప్రధానంగా విద్యా వైద్యానికి సంబంధించి అవసరమైన మేరకు చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించిన అర్హులైన వారందరికీ ఇవ్వాలని తమ రాష్ట్ర, జాతీయ కార్యవర్గాలు పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. వారం రోజులు పాటు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొలి రోజు కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని పెద్ద ఎత్తున జర్నలిస్టులు తమ కార్డులను రెన్యువల్ చేసుకున్నట్లు వీరు చెప్పారు. సోమవారం నుంచి కలెక్టరేట్ ప్రాంగణంలోని ఏపీ ఎన్జీవో భవనంలో ఈ సభ్యత్వం నమోదు కార్యక్రమం తిరిగి ప్రారంభం అవుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో అసియేషన్ రాష్ట్ర నాయకులు జి.శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్, బ్రాడ్కాస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఈరోతి ఈశ్వరరావు, పలువురు పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

## లక్ష 75 వేల రూపాయల మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సబ్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ ఆదేశాలతో శుక్రవారం అనకాపల్లి పట్టణం మిర్యాల కాలనీ, 3వ వీధి వద్ద అక్ర మంగా మద్యం బాటిళ్ల నిల్వ ఉంచిన ఇంటిపై అనకాపల్లి సబ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి.అనిల్ కుమార్ తమ సిబ్బందితో రైడ్ చేసి 909 మద్యం బాటిళ్ల (క్వార్టర్ బాటిళ్లు-719, బీర్ బాటిళ్లు-179, ఫుల్ బాటిళ్లు-11) స్వాధీనం చేసుకున్నారు. సుమారు దీని విలువ రూ.1,75,000/- ఉంటుంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సబ్ పోలీసులు. ఈ రైడ్ లో సెబ్ పోలీసు సిబ్బంది ఎస్సై శ్రీనివాస్, జయంతి, ప్రసన్న, సత్తిబాబు, వెంకటేష్ , శకుంతల దాడులలో పాల్గొన్నారు.

# తుమ్మపాలలో దాసరి కులస్థుల ఆత్మీయ సమావేశం




అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): టీడీపీ ప్రభుత్వంలో బీసీల అభివృధి కోసం ప్రత్యేక బీసీ సబ్ ప్లాన్ ఇస్తే జగన్ రెడ్డి బీసీ సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించారు అని మాజీ శాసన సభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ గారు ఆరోపించారు.56 బీసీ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వకుండా బీసీలను ఆర్థికంగా ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. టీడీపి అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తాం అని హామీ ఇచ్చారు. శనివారం అనకాపల్లి మండలం, తుమ్మపాలలో టీడీపి దాసరి సాధికార సమితి ఆధ్వర్యంలో జరిగిన దాసరి కులస్థుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా పాల్గొన్నారు.ఈ సంధర్భంగా టీడీపీ అధికారంలోకి రాగానే దాసరి సంక్షేమ భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. టీడీపి బీసీల కోసం పుట్టిన పార్టీ అని, బీసీలకు స్థానికసంస్థలలో రిజ్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదే అని అన్నారు. జగన్ దుర్మార్గపు పాలన వల్ల 13వేల మంది బీసీలు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కోల్పోయారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ బీసీలకు టీటీడీ చైర్మన్ ఇస్తే వైకాపా తన సొంత సామాజిక వర్గం వారికే ఇచ్చిందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ళ సురేంద్ర, రాష్ట్రా దాసరి కన్వీనర్ తుపాకుల అప్పారావు, యాడ్ల గోవింద, కోలపర్తి కన్నబాబూ, కోలపర్తి శ్రీను, రమనాజి,కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబీ, రాజు, రాము, దాసరి కుల పెద్దలు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

# అడవివరం స్మశాన వాటిక అభివృద్ధికి ప్రణాళికలు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆదివారం గ్రామ పరిధిలో ఉన్న స్మశాన వాటికకు వెళ్లే మార్గంలో పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నామని అప్పన్న ఆలయ ఈవో సింహం శ్రీనివాస్ మూర్తి తెలిపారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండల సభ్యులు గంట్ల శ్రీనుబాబు ఈ స్మశాన వాటికకు సంబంధించిన పలు అంశాలను శనివారం ఈవో దృష్టికి తీసుకువెళ్లారు వరాహ పుష్కరిణి ప్రాంగణం అనుకొని ఉన్న ఈ స్మశాన వాటికకు సరైన రహదారి సదుపాయం లేదని అంతేకాకుండా మార్గమధ్యంలో సరైన సదుపాయాలు లేవని ఈవో కి వివరించారు దీనిపై ఈవో సానుకూలంగా స్పందించారు ఇప్పటికే తాను స్మశాన వాటిక ప్రాంతాన్ని మార్గాన్ని పరిశీలించడం జరిగింది అన్నారు. అవసరమైన మూడు చోట్ల అభివృద్ధి పనులు చేసేందుకు నిర్ణయించమన్నారు ఎందుకు సంబంధించి తమ ఇంజనీరింగ్ అధికారులకు ఇప్పటికే తగిన ఆదేశాలు జారీ చేశామన్నారు జీవీఎంసీ నుంచి కూడా తగిన తగిన సహకారం తీసుకోవాల్సి ఉందని కమిషనర్ తో చర్చించి త్వరలోనే ఆపనులు కార్యరూపం దాల్చిన చూస్తామన్నారు ఈ సందర్భంగా గంటల శీను బాబు మాట్లాడుతూ తను అప్పటికే ఈ విషయాన్ని పలు అధికారులు దృష్టికి తీసుకెళ్లామని దేవస్థానం సానుకూలంగా స్పందిస్తే జీవీఎంసీ నుంచి తగిన సహకారం కచ్చితంగా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు సుమారు 30 లక్షల నిధులు మంజూరుకు జీవీఎంసీ ఇప్పటికే సుముఖత వ్యక్తం చేసింది అన్నారు వరాహ పుష్కరిణి ప్రాంతంలో కూడా అభివృద్ధి పనులు వీలైనంత త్వరలో పూర్తి చేస్తామని ఈవో చెప్పారు

# లయన్స్ ఎలైట్ చే గణతంత్ర పురస్కారాలు




కాకినాడ, (విశాఖ సమాచారమ్): నిత్యము సేవా కార్యక్రమాలో నిమగ్నమవ్వడమే కాక దేశసేవ కోసం పాటుపడిన పలువురిని గణతంత్ర పురస్కారాలతో లయన్స్ ఎలైట్ క్లబ్ ఘనంగా సత్కరించింది. గణతంత్ర దినోత్సవ సందర్భంగా స్థానిక చల్లా ఫంక్షన్ హాల్‌లో క్లబ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. తొలుత జాతీయ పతాకాన్ని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్, క్లబ్ వ్యవస్థాపకులు ముంజలూరి విశ్వేశ్వర రావు ఎగురవేసి సభ్యుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్‌తో పాటు సామాజిక సేవకులను ఎంపిక చేసి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా వారి సేవలను గుర్తించడమే కాక నేటి తరానికి వాటి విశిష్టతను పరిచయం చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. లయన్స్ ఎలైట్ క్లబ్ నిత్యము సామాజిక సేవ, విద్య, వైద్య, క్రీడా రంగాలలో అనేక కార్యక్రమాలను చేపడుతూ క్లబ్ సభ్యులు సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నారని విశ్వేశ్వరరావు అన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా విశ్రాంత ఆర్మీ అధికారి పిరాడి మంగరాజు, విశ్రాంత ఎయిర్ ఫోర్స్ అధికారి ఎం.వి.ఎస్.సూర్యనారాయణ మూర్తి, సామాజిక సేవకులు గొల్లపల్లి గురుబాబు, నరసింహా రావులను క్లబ్ అధ్యక్షులు ఎన్.వి.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ కటకం శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కిషోర్, కోశాధికారి రాఘవరావు, మండలిక శాస్త్రి, గుంటూరు సత్యనారాయణ, చల్లా నిరంజన్, సత్తిరెడ్డి, గొర్రెల సూర్యనారాయణ, ఆర్.విఠల్, మైలవరపు సత్యనారాయణ (ఎం.ఎస్.ఆర్), సాయి, సాగర్, ఫణి, ఎం.ఎస్.ఎన్ ప్రభృతులు పాల్గొన్నారు. సన్మాన గ్రహీత పిరాడి మంగరాజు మాట్లాడుతూ దేశ సంరక్షణలో తమకు ఎదురైన అనేక అనుభవాలను, భారతదేశ గొప్పతనాన్ని అద్భుతంగా వివరించారు. ప్రపంచంలోనే భారతదేశ సైనికులు అందరికీ ఆదర్శప్రాయంగా ఉంటారని మరియు నియమ నిబంధనలు కూడా ఇతర దేశాలు గౌరవించడం గొప్ప విషయం అన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా సన్మానాన్ని పొందడం చాలా ఆనందంగా ఉందని, సేవాస్ఫూర్తి కలిగిన వ్యక్తుల నుండి సన్మానం స్వీకరించడం గర్వంగా ఉందని మంగరాజు అన్నారు.

# సంపూర్ణ స్వరాజ్యం" కోసం 200 సంవత్సరాలకు పైగా పోరాడారు అన్నారు డా.ఊహమహంతి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): అందరికి సమాన అవకాశాలు కల్పిస్తూ మన భారత దేశం గణతంత్ర రాజ్యంగా అవతరించిన క్షణాలను గుర్తు చేసుకుందాం అంటు.75 వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఓ పత్రికా ప్రకటన ద్వారా విడుదల చేశారు. డా.ఊహమహంతి - డైరక్టర్, రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ,విశాఖపట్నం

.భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఇలా అన్నారు. 'రాజ్యాంగం కేవలం న్యాయవాదులు సమర్పించిన పత్రం కాదు.. ఇది దేశ ప్రజల జీవితాలను నడిపే వాహనం. దీని స్ఫూర్తి ఎల్లప్పటికీ నిలచి ఉంటుంది'అని అన్నారు.

భారతదేశ రాజ్యాంగానికి 1950, జనవరి 26న ఆమోదం లభించింది. దీనికి గుర్తుగా ప్రతియేటా జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటాం. భారతదేశానికి 1947లో బ్రిటిష్‌వారి నుండి స్వాతంత్ర్యం లభించినప్పటికీ,1950 జనవరి 26 నుంచి భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. దీంతో భారత్ ఒక సార్వభౌమ అధికారం కలిగిన గణతంత్ర దేశంగా గుర్తింపు పొందింది.మన దేశం బలమైన దేశంగా ముందుకు సాగడానికి ఈ రోజు మనందరికీ ధైర్యాన్ని, స్ఫూర్తిని ఇస్తుంది. ఈ రోజు మనకు రిపబ్లిక్ ఆఫ్ ఇండియా స్థాపనను గుర్తు చేస్తుంది. భారతదేశానికి స్వాతంత్రం పొందడంలో భారత రాజ్యాంగాన్ని అమలు చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించిన గొప్ప వ్యక్తులను కూడా ఈ రోజు మనం స్మరించు కుంటాము. మన గొప్ప భారతీయ నాయకులు స్వాతంత్ర సమర యోధులు మహాత్మా గాంధీ, భగత్ సింగ్, చంద్ర శేఖర్ ఆజాద్, లాలా లజపత్ రాయ్, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ లాల్ బహదూర్ శాస్త్రి మొదలైనవారు దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారు. రిపబ్లిక్ అంటే దేశంలో నివసించే ప్రజల అత్యున్నత శక్తి దేశాన్ని సరైన దిశలో తీసుకెళ్లడానికి రాజకీయ నాయకులుగా తమ ప్రతినిధులను ఎన్నుకునే హక్కు ప్రజలకు మాత్రమే ఉంది.

భారత రాజ్యాంగానికి ఉన్న అధికారాల వల్ల దేశంలో మనకు నచ్చిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఇతర నాయకులను మనం ఎన్నుకోగలుగుతాము.

మనం గర్వించదగిన భారత స్వాతంత్ర సమరయోధులు భారత దేశంలో "సంపూర్ణ స్వరాజ్యం" కోసం 200 సంవత్సరాలకు పైగా పోరాడారు.

తమ భవిష్యత్ తరాలు ఎవరికీ బానిసలుగా ఉండకూడదని,తమ హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వారు ఇలా త్యాగాలు చేశారు.

ఈ సందర్భంగా మనం కూడా మన కర్తవ్యాలను నిర్వర్తించాలని,రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును సృష్టిస్తామని ప్రతిజ్ఞ చేయాలి.

అప్పుడే భారతదేశాన్ని బలమైన దేశంగా తీర్చిదిద్దగలం.పౌరులందరికీ రాజ్యాంగంపై అవగాహన కల్పించి, అందరికీ సమానంగా జీవించే అవకాశం కల్పించినప్పుడే త్యాగధనుల త్యాగానికి విలువ పెరుగుతుంది. అలాగే పేదరికం,నిరుద్యోగం, నిరక్షరాస్యత, గ్లోబల్ వార్మింగ్, అసమానత మొదలైన సామాజిక సమస్యల గురించి ప్రతీ ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేస్తేనే పరిష్కారం అవుతాయి అని తెలిపారు.

# టౌన్‌హాల్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ



కాకినాడ, (విశాఖ సమాచారమ్): విద్యలో ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థిని విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం ద్వారా పరోక్షంగా సమాజాభివృద్ధికి దోహదపడతారని ప్రముఖ పారిశ్రామికవేత్త, దేవి ఫిషరీస్ అధినేత యార్లగడ్డ వీర్రాజు అన్నారు. టౌన్ హాల్ ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థిని విద్యార్థులకు రెండు లక్షల రూపాయలు స్కాలర్ షిప్‌ల క్రింద చెక్కులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని యార్లగడ్డ వీర్రాజు లాంఛనంగా ప్రారంభించారు. సమావేశానికి టౌన్‌హాల్ కమిటీ అధ్యక్షులు నానాజీ అధ్యక్షత వహించగా అతిథులకు కార్యదర్శి పాబోలు చినపున్నయ్య స్వాగతం పలికారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యార్లగడ్డ వీర్రాజు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన టౌన్‌హాల్ కమిటీ ప్రధాన ఆశయం విద్యారంగానికి చేయూతనివ్వడమేనని, విద్య ద్వారా అన్ని రంగాల అభివృద్ధికి పరోక్షంగా దోహదపడుతుందన్నారు. లిటరరీ అసోసియేషన్‌గా పేరుగాంచిన టౌన్‌హాల్ యొక్క ఆశయాలను కమిటీ అంకిత భావంతో అమలు చేయడం అభినందనీయమని, అందుకు సభ్యులకు కూడా సహాయ సహకారాలు అందించడం గొప్ప విషయం అన్నారు. స్కాలర్‌షిప్‌లు స్వీకరించిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడమే కాక తిరిగి టౌన్‌హాల్ చేస్తున్న విద్యారంగ సేవలో భాగస్వామ్యం అవడం అభినందనీయమని వీర్రాజు కొనియాడారు. క్రమం తప్పకుండా విద్యారంగ సేవ చేయడమే కాక సభ్యుల యోగక్షేమానులకు ప్రాధాన్యత ఇవ్వడం సభ్యుల పట్ల ఉన్న గౌరవభావాన్ని వెల్లడిస్తోందని వీర్రాజు అన్నారు. కార్యదర్శి పాబోలు చినపున్నయ్య మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడమే కాక విద్యారంగానికి చేయూతనివ్వడం వంటి కార్యక్రమాలను సభ్యుల సహకారంతో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని చెప్పారు. చెక్కులను అందుకున్న విద్యార్థిని విద్యార్థులు వాడకట్టు సాయి హర్ష, జె.దివ్యకీర్తన, జి.ఆదిత్యకుమార్, డి.భాగ్యఅక్ష, పి.వి.నాగసాయిరాం, ఎం.దివ్యశ్రీ, అచంట అనిత, టి.లలిత, కె.అనిల్ కుమార్, నేమాని సాయి వెంకట మాధవి, పట్నాల అఖిల్ వినీత సాయిశ్రీ, పాలెపు శ్రీరామాంజనేయులు, వై.రవితేజ, సాలిగ్రామ శ్రావణి రత్నశ్రీ, వానపల్లి శ్రీనివాస్ చిన్నయ్యలు అందుకున్నవారిలో ఉన్నారు.

కార్యక్రమంలో టౌన్‌హాల్ కమిటీ అధ్యక్షులు నానాజీ, కార్యదర్శి పాబోలు చినపున్నయ్య, పాలడుగు సుబ్రహ్మణ్యం, సి.ఆర్.జోగారావు, నేమాని రామం, సి.సాయి తేజ, జి.వై.రఘునాథ్, సిహెచ్.ఇంద్రనీల్, బళ్ళ సత్యప్రసాద్, పైడా రాజేంద్ర, జ్యోతుల రాము, పైడా సురేంద్ర, జికే.శ్రీనివాస్, పి.వి.ఎస్.ఎన్.పున్నయ్య, డాక్టర్ ఎంవి.రావు, బచ్చు శేఖర్, మంతెన సూర్యనారాయణ రాజు, బి.శివ ప్రసాద్, బి.రవినారాయణ, పెద్దిరెడ్డి సతీష్, సుసర్ల సుబ్రహ్మణ్యం, వెత్సా ఆనంద్‌తో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. స్కాలర్‌షిప్‌ల సబ్‌కమిటీ చైర్మన్ నేమాని రామం మాస్టారును ఘనంగా సత్కరించారు.

# రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్ ఆధ్వర్యంలో పద్మనాభం లో టైలరింగ్ శిక్షణా కేంద్రం




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఈ రోజు ఉదయం పద్మనాభం లో టైలరింగ్ శిక్షణా కేంద్రం రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్ క్లబ్ సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ శశి జైస్వాల్, సెక్రటరీ ఆర్.నీరజ, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ ఆర్.కాళీ ప్రసాద్, ట్రెజరర్ ఎస్. కామేశ్వర రావు, రోటరియన్స్ గోపాల్, కిరణ్ జైస్వాల్ పాల్గొన్నారు. క్లబ్ కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ లో భాగంగా 5 కుట్టు మిషనులు ఇవ్వడం జరిగింది. మిషన్లును ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కె.రమా ప్రభ మరియు ఐద్వా స్థానిక నాయకులు నాగరాణి, సూర్యకాంతం, స్థానిక నాయకులు రాము, ఆర్.నరసింగరావు, రాజు మొ,, వారు పాల్గొన్నారు. సంస్థలు ద్వారా నిర్వహించడం జరుగుతుంది.

మేలుకో! ఆంధ్ర ప్రదేశ్
పార్లమెంటు స్థాయి ప్రతినిధుల
తొలి సమావేశానికి
ఆహ్వానం!
30 January
అజెండా
- రాష్ట్ర స్థాయిలో మన రాజకీయ అవగాహన, కార్యాచరణ, మన సామాజిక మాధ్యమం పనికి చెందిన నివేదికలు ప్రవేశపెట్టడం, భవిష్యత్ కార్యాచరణపై ప్రతిపాదనలు;
- వివిధ జిల్లాల నుండి, నియోజక వర్గాల నుండి వచ్చిన ప్రతినిధులు అక్కడ జరిగిన పనిపై నివేదికలు ఇవ్వడం భవిష్యత్ కార్యాచరణలపై ప్రతిపాదనలు పెట్టడం
- సాంస్కృతిక బృందాల ఏర్పాటు;
- తీర్మానాలు ఆమోదించడం.

వేదిక: స్వాతంత్ర సమర యోధుల భవనం, బందర్ లాకుల వద్ద విజయవాడ.
తేది: 30.1.24మంగళవారం
ఉ: 10:00 నుండి సా: 5 వరకు.
సమయ పాలన ప్రధానం
కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ అభినందనలతో....
టీం, మేలుకో ఆంధ్రప్రదేశ్

# గన్ పౌడర్ పేలి ప్రమాదం

## ఓ కూలి మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమం



కృష్ణాజిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.. ముదినేపల్లి మండలం చిన్నకామన పూడిలో గన్ పౌడర్ పేలి ఓ కూలీ మృతి చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. అసోంకు చెందిన ఇద్దరు కూలీలు చేపల చెరువు దగ్గర కాపలాదారులుగా పని చేస్తున్నారు. చెరువులపై చేపలు తినేందుకు వచ్చే పిట్టలను వారు తుపాకీతో కాల్చి చంపుతుంటారు. ఈ క్రమంలో వారిద్దరూ తుపాకీలో వాడేందుకు గన్ పౌడర్ తయారు చేస్తుండగా హఠాత్తుగా పేలింది. దీంతో ఘటనలో రిటూ బరో చనిపోగా.. బికాస్ బరోకు తీవ్ర గాయాలు అయ్యాయి..

చినకామనపూడిలో ఓ రైతుకు చెందిన చేపల చెరువు దగ్గర అసోంకు చెందిన బికాస్ బరో, రిటూ బరో కాపలాదారులుగా పనిచేస్తున్నారు. రిటూ బరో ఎడమ చేయి పూర్తిగా తునాతునకలు అవడంతో పాటు, తలకు బలమైన గాయాలు అవడంతో అక్కడికక్కడే చనిపోయాడు. బికాస్ బరోకు కూడా తీవ్ర గాయాలు అవడంతో అతడి పరిస్థితి విషమంగా ఉంది. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్యుల సిఫారసు మేరకు మెరుగైన వైద్యం కోసం బికాస్‌ను విజయవాడకు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం రిటూ బరో మృతదేహాన్ని గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

# కుల గణన త్వరగా పూర్తి చేయండి



**విజయనగరం:** జిల్లాలో కులగణన ప్రక్రియను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం కూడా జిల్లాలో కులగణన నిర్వహించాలని స్పష్టం చేశారు. వివిధ మండలాల ఎంపిడిఓలు, తాశిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కుల గణన, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ప్రభుత్వ పథకాలపై బెస్ట్ టెస్ట్ మొనీ, అసైన్డ్ భూముల క్రమబద్దీకరణ, పేదల ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో కులగణనలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇప్పటికే 80 శాతం ఇళ్లకు వెళ్లడం జరిగినప్పటికీ, 70 శాతం మంది వివరాలను మాత్రమే నమోదు చేశారని చెప్పారు. అన్ని కుటుంబాల్లో సభ్యుల పూర్తి వివరాలను నమోదు చేసి, బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు. ఆదివారం కూడా పనిచేసి, వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై సమీక్షిస్తూ, కార్డుల పంపిణీని పదిరోజుల్లో పూర్తి చేయాలన్నారు. కార్డులను పంపిణీ చేసే సమయంలో సిఎం వీడియో ఫిల్మ్‌ను లబ్దిదారులకు చూపించాలని, కరపత్రాలను అందజేయడమే కాకుండా, ఆరోగ్యశ్రీ యాప్‌ను వారి మొబైల్‌లో డౌన్‌లోడ్ చేయించాలని సూచించారు. ప్రతీ సచివాలయం పరిధిలో రోజుకు కనీసం 50 కార్డులను పంపిణీ చేయాలని, మొత్తం పంపిణీ ప్రక్రియ 10 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాకు 5.39 లక్షల కార్డులు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు 4.11 లక్షల కార్డులు వచ్చాయని, మిగిలినవి కూడా కొద్ది రోజుల్లో జిల్లాకు చేరుకుంటాయని తెలిపారు. ఇంటింటికీ వెళ్లే సమయంలో దిశ యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేయించాలని సూచించారు. అసైన్డ్ భూముల క్రమబద్దీకరణ ప్రక్రియ జిల్లాలో చాలా నెమ్మదిగా జరుగుతోందని అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 9,700 ఎకరాలను గుర్తించినప్పటికీ, వాటికి సంబంధించి తాశిల్దార్లనుంచి పూర్తిస్థాయిలో నివేదికలు అందడంలో చాలా ఆలస్యం అవుతోందని చెప్పారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం క్రింద పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రిజిష్టర్ చేసేందుకు సిద్ధం కావాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 61,927 ఇళ్ల పట్టాలను రిజిష్టర్ చేయించాల్సి ఉందని తేలిందని, వాటికి సరిహద్దులను నమోదు చేసి, మ్యాపింగ్ చేసి, ఇతర వివరాలను సిద్ధం చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు.

డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ బెస్ట్ టెస్ట్ మొనీ ఎంపిక గురించి వివరించారు. వైఎస్ఆర్ పింఛన్ కానుక, ఆసరా, చేయూత ప్రభుత్వ పథకాలకు సంబంధించి వలంటీర్ల నుంచి టెస్ట్ మొనీలు చేరాల్సిన గడువు ఇప్పటికే ముగిసిందని చెప్పారు. వాటిని ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి, ప్రతీ మండలం నుంచి ఒక్కో అంశానికి రెండు చొప్పున, ఈ నెల 30 లోగా జిల్లా స్థాయికి అప్‌లోడ్ చేయాలని చెప్పారు. జిల్లా స్థాయి కమిటీ వాటిని పరిశీలించి, ఉత్తమంగా ఉన్నవాటిని ఎంపిక చేస్తుందని చెప్పారు. మండల స్థాయిలో ఉత్తమంగా ఎంపికైన వాటినికి రూ.15వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.20వేలు, జిల్లా స్థాయిలో రూ.25 వేలు నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందని వివరించారు. వలంటీర్లకు సన్మానం జరిగే ఫిబ్రవరి 4వ తేదీన ఈ బహుమతి ప్రదానం ఉంటుందని పిడి తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయాల స్పెషల్ ఆఫీసర్ నిర్మలాదేవి, జెడ్‌పి సిఇఓ కె.రాజ్‌కుమార్, మెప్మా పిడి సుధాకరరావు, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిపిఓ శ్రీధర్ రాజా, డిఎల్‌డిఓ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఆర్చ్ ప్రారంభించిన మంత్రి జి.అమర్నాథ్





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పారు. శనివారం ఆయన రూ.2 కోట్ల 50 లక్షలతో నిర్మించిన జాతీయ రహదారి నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే ఆర్చ్ శనివారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఆర్థికంగా ఎన్ని సమస్యలు ఎదురైనప్పటికీ మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రూ 11 కోట్లతో అభివృద్ధి చేయనున్న కలెక్టరేట్ రోడ్డు పనులకు ఎంపీ డాక్టర్ బి వి సత్యవతి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బిస్మరణ రాజ్ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ సంస్థ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ అనకాపల్లి ఆర్డీవో ఏ.చిన్నికృష్ణ హౌసింగ్ పీడీ కే. రమామణి ఎంపీపీ గొర్లె సూరిబాబు డబ్ల్యూ ఎస్ పి ఆర్ ఇంజనీర్లు నాగేశ్వరరావు వీరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్రేయ స్మారక కళా పీఠం ఆధ్వర్యంలో 30న వేటూరి చిత్ర గీతాలు







**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తి 80 వ జయంతి సందర్భంగా ఆత్రేయ స్మారక కళా పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30 వ తేదీన అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియం లో ఎదలో మోహన లాహిరి శీర్షికన వేటూరి విరచిత చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి జరగనుంది. ఇందులో సినీ గాయని సాహితీ, రమేష్ పట్నాయక్, శంబర జోగారావు, బాల గణేష్, హారిక శ్రీకాకళం, హారిక విజయనగరం, లీపికా రెడ్డి తదితరులు లైవ్ ఆర్కెస్ట్రా లో పాడనున్నారు. కావునా సంగీత ప్రియులు, కళా సంస్థల అధినేతలు, గాయనీ గాయకులు హాజరై జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నాము.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి



**పార్వతీపురం రూరల్, (విశాఖ సమాచారమ్):** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా మలేరియా అధికారి(డిఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు కోరారు. శనివారం అడ్డాపుశిల గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ డ్రైడే కార్యక్రమాల నిర్వహణ తీరును పలు వీదుల్లో సందర్శించి పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండటానికి ఆస్కారం ఉన్న వాడని,పాడైపోయిన వస్తువులు,బాటిల్స్,ఉపయోగంలో లేని రుబ్బురోల్లు,నీటి డ్రమ్ములు,కుండీలు మొదలగునవి పరిశీలించారు.వీది కాలువల్లో చెత్త వేయరాదని అందువల్ల నీరు నిల్వ ఉండిపోయి దోమల వ్యాప్తికి కారణమవుతుందని అక్కడ ప్రజలకు సూచించారు.మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని తద్వారా దోమల వ్యాప్తి తగ్గి వ్యాదులు దరి చేరకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. సిబ్బంది సమన్వయంతో డ్రైడే కార్యక్రమాలు నిర్వహించి,పరిసరాల శుభ్రత పై ప్రజల్లో అవగాహన కల్పించాలని డాక్టర్ జగన్ మోహన్ సూచించారు. దోమల ఆవాసాల ప్రదేశాలను గుర్తించి సంబంధిత యాప్ లో వివరాలను సిబ్బంది నమోదు చేయాలన్నారు. అనంతరం వెల్నెస్ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ సూర్యనారాయణ,వైద్య సిబ్బంది శ్రావణిసంధ్య,ఆశా కార్యకర్తలు,వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# 25వేల మంది విద్యార్థులతో 30న గీతం ఎడుయూత్ మీట్




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సమాజంలో మానవత విలువలను పెంచడానికి "కలిసి నడుద్దాం, కలిసి ఎదుగుదాం, ముందుకు సాగుదాం" అనే నినాదంతో పాటు మత్తు మందుల వినియోగానికి వ్యతిరేఖంగా యువత ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరియు ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక సంస్థ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంయుక్తంగా ఈ నెల 30వ తేదీన ఎడుయూత్ మీట్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ తెలిపారు. గీతం విశ్వవిద్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలియజేశారు. దాదాపు 25వేల మంది విద్యార్థులు వివిధ కళాశాలల నుంచి ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారని ఆయన వెల్లడిరచారు. దీనికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక వేత్త గురుదేవ్ రవిశంకర్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలో రెండు వేల మంది గీతం విద్యార్థులు సభ్యులుగా చేరి ప్రయోజనం పొందారని, చదువులో సహితం రాణిస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ లోని ఇతర కళాశాలల విద్యార్థులు తమ జీవితంలో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనదలిచిన విద్యార్థులు ఎడుయూత్‌మీట్.కామ్ ద్వారా ఉచితంగా పాసులను పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికేట్‌లను సహితం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎడుయూత్‌మీట్ డైరక్టర్ జి.అనూప్, కార్యక్రమ విభాగం డ్కెరక్టర్ డాక్టర్ సి.విరాట్ మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరిలో పూణే లోని సావిత్రిభాయ్ పూలే విశ్వవిద్యాలయంలో మొదటి సారిగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి లక్షా యాభైవేల మంది విద్యార్థులు హాజరయ్యారని నిర్వహకులు తెలిపారు. విశాఖలో కార్యక్రమ నిర్వహణకు గీతం ముందుకు రావడం అభినందనీయమని దీనిని అందరు ఉపయోగించుకోవాలని సూచించారు.


Sugar Free
Fitearly
నడివయస్కులకు దివ్య శక్తి
ఫిట్ ఎర్లీ
थकावट से सत्वर उपसमन
फिट एर्ली

వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?

మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?

దిగులు చెందకండి.

"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.

సోయప్రోటీన్,
వే ప్రోటీన్,
బ్రాహ్మి,
హరితకి,
సీ భక్తారన్,
శొంఠి,
తులసి,
అశ్వగంధ

తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ఠ వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కంమైన ఫలితాలను ప్రకటించుకోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి
ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179
ఈ-మెయిల్: surampudi43@gmail.com

HERBINDO LABS PRIVATE LIMITED ®
HEALTH AND HAPPINESS
Compli

HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

# యువత కోసం అభిలాష గ్రంథాలయాలు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** యువత కోసం "అభిలాష' సామాజిక గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్ తెలిపారు. "అభిలాష' సామాజిక గ్రంథాలయాలను యువత పెద్ద ఎత్తున వినియోగించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సీతానగరం మండలం పెదబోగిలి గ్రామ సచివాలయం - 2 లో అభిలాష గ్రంథాలయాన్ని సందర్శించారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన అభిలాష యాప్ ను వినియోగాన్ని పరిశీలించారు. జిల్లాలో నీతి ఆయోగ్ నిధులతో "అభిలాష"ను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం 97 గ్రామ సచివాలయాల పరిధిలో వీటిని ఏర్పాటు చేసి సివిల్స్, గ్రూప్స్, యుపిఎస్సీ, ఎస్ఎస్సి, ఆర్ ఆర్ బి, బ్యాంక్స్, జెఇఇ, నీట్, జె ఆర్ ఎఫ్ తదితర అన్ని రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే విధంగా 66 రకాలకు చెందిన 12,804 పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చామని ఆయన వివరించారు. 200 గ్రామ సచివాలయాల పరిధిలో ఇటువంటి గ్రంథాలయాలు ఏర్పాటు చేయుటకు నిర్ణయించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఉన్నత చదువులు, ఉద్యోగాల పట్ల ఆసక్తిగల యువత వీటిని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి కె రామచంద్ర రావు, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గవరపాలెం గౌరమ్మ సంబరం





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన అనకాపల్లి గవరపాలెం శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం ఉదయం అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అతి సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుండి భక్తులు ఆలయానికి తరలివచ్చి గౌరీ పరమేశ్వరులకు ముడుపులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉదయం నుండి గవరపాలెం ప్రాంతమంతా పండగ వాతావరణంతో సందడిగా మారింది. వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలతో మరింత సందడిగా మారింది. అమ్మవారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ శాసనమండలి సభ్యుడు బుద్ద నాగ జగదీశ్వరరావు, వైకాపా అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్, ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైకాపా అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, డాక్టర్ రామ్మూర్తి, వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ కమిటీ ఘనంగా స్వాగతం పలికి గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చిత్రపటాలతో ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు సత్కరించారు. ఉదయం నుండి ఆలయం వద్ద వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన జానపద కళాకారులు చేసిన జానపద కళారూపాలు గరగలు కేరళ వాయిద్యాలు, పులి వేషాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. రాత్రికి 27 భారీ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ సంతోష్ అప్పారావు నాయుడు తెలిపారు. గవరపాలెం పార్కు సెంటర్ వద్ద శ్రీ గౌరీ పరమేశ్వరుల విగ్రహం వద్ద 60 మంది కళాకారులతో నిర్వహిస్తున్న అతి భారీ డాన్స్ ప్రోగ్రాం చూపరులను ఆకట్టుకుంటుంది. కలకత్తా వారి లైటింగ్ ఆకర్షణీయంగా ఉంది. గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మి నాయుడు, ఉపాధ్యక్షులు కొణతాల వెంకట ప్రసాద్, సహాయ కార్యదర్శి పి.వి.రమణ దాడి కృష్ణ, కొణతాల మురళీకృష్ణ కొణతాల చంద్రశేఖర్ కొణతాల జగ్గారావు నాయుడు ఉత్సవాన్ని పర్యవేక్షిస్తున్నారు.

# టాప్ సిడెడ్ అంతర్జాతీయ చదరంగం క్రీడాకారులకు చుక్కెదురు



ఈశ్వరీయ ప్రభాకర్‌కు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం వేదికగా స్థానిక S3 స్పోర్ట్స్ ప్రాంగణంలో శ్రీ చెస్ అకాడమీ వారి 2 వ అంతర్జాతీయ చదరంగం పోటీలు మూడవరోజు ఉదయం ప్రారంభమయ్యాయి. ఐదవ రౌండ్ ప్రారంభానికి ముఖ్య అతిథిగా విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ హాజరయ్యారు. ఇటువంటి అంతర్జాతీయ చదరంగం పోటీలు మన విశాఖపట్నం వేదికగా జరగటం, ఇటువంటి చదరంగం పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి మరియు వివిధ దేశాల నుంచి 419 మంది క్రీడాకారులు ఇక్కడికి రావడం వలన, మన జిల్లాకు ఎంతో మంచి పేరు వచ్చిందని ఆమె అన్నారు.

ఐదవ రౌండ్ ముగిసేసరికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన టాప్ సీడెడ్ క్రీడాకారుడు వి.రాఘవ్ శ్రీవత్సవపై తమిళనాడుకు చెందిన కె దినేష్ బాబు విజయం సాధించగా, ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాకు చెందిన కె సురేష్ పై ఏలూరు జిల్లాకు చెందిన మూడవ సీడెడ్ క్రీడాకారుడు బి లక్ష్మణరావు నెగ్గగా, తమిళనాడు రాష్ట్ర కి చెందిన క్రీడాకారుడు పి బాలాజీ పై విశాఖపట్నం జిల్లాకు చెందిన నాలుగవ సీడెడ్ క్రీడాకారుడు బొమ్మన వెంకట రిత్విక్ విజయం సాధించారు.

ఈ విధంగా ఈ అంతర్జాతీయ చదరంగం పోటీలలో క్రీడాకారులు నువ్వా నేనా అనే విధంగా తలబడుతున్నారని టోర్నమెంట్ డైనమిక్ డైరెక్టర్ డాక్టర్ శ్రీ రంగాల బాబురావు అన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ మేనేజర్ వి. శ్రీకాంత్, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట బాలకృష్ణ మరియు ఇంటర్నేషనల్ ఆర్బిటర్ జీవి కుమార్ పాల్గొన్నారు.

# గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న మాజీ మంత్రి దాడి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన అనకాపల్లి గవర పాలెం శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా మాజీ మంత్రి దాడి వీరభద్రరావు గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని పూజలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు దాడికి ఘన స్వాగతం తెలిపారు. అనంతరం గౌరీ పరమేశ్వరుల చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.

# ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు




**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** "సమరసతా సేవా ఫౌండేషన్" రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు రాజమహేంద్రవరం శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్ లో మూడురోజుల పాటు జరుగుతున్నాయి.ఈ సమావేశాలకి అనకాపల్లి జిల్లా నుండి ఎనిమిది మంది ధర్మ ప్రచారకులు పాల్గొన్నారు. ఈ సమావేశాలు 26,27,28 తేదీలలో జరుగుతున్నాయని ప్రతీ గ్రామంలో దేవాలయాలలో వారం వారం భజనలు, ప్రతీ పౌర్ణమి కి సామూహిక హారతి, ఏకాదశి కి నగర సంకీర్తన, నిత్యం జరుగుతూ ఉండాలని, మతమార్పిడి జరగకుండా ఉండాలంటే ఏం చేయాలి, గ్రామ ధార్మిక సమితిలు బలపడాలని, మారుమూల గ్రామాల్లోని కూడా ధర్మం గురించి తెలిసేలా ఉండాలని ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి "సమరసతా సేవా ఫౌండేషన్" సభ్యత్వ నమోదు ప్రారంభం గురించి చర్చించటం జరిగిందని యలమంచిలి ఖండ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు తెలియజేసారు. రాష్ట్ర వ్యాప్తంగా 172 మంది ధర్మ ప్రచారకులు పాల్గొన్నారు.అనకాపల్లి జిల్లానుండి ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారకులు ఆడారి గంగాధర్, జిల్లా ధర్మ ప్రచారకులు నక్కా సత్యన్నారాయణ, మాడుగుల ఖండ ధర్మ ప్రచారకులు తవ్వా సన్యాసి సెట్టి, యలమంచిలి ఖండ కొల్లి అప్పారావు, పాయకరావుపేట ఖండ కట్టా వీరబాబు, నర్సీపట్నం ఖండ రావుల వరహాలరావు, కోటఉరట్ల ఖండ పొన్నపు పోతురాజు ధర్మ ప్రచారకులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి అమర్నాథ్, ఎంపీ సత్యవతి




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి నియోజక వర్గంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలలో శనివారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడి వాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బి.వి సత్యవతి పాల్గొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల నుండి 11 లక్షల 50 వేల రూపాయలతో కలెక్టర్ కార్యాలయ అప్రోచ్ రోడ్ విస్తరణ పనులకు, 2కోట్ల ఎన్‌టిపిసి సిఎస్ఆర్ నిధులతో రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పఠాన్ శెట్టి జాయింట్ కలెక్టర్ జాహ్నవి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి నియోజక వర్గం సమన్వయ కర్త మలసాల భరత్ కుమార్, ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లె సూరిబాబు, అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కె విష్ణుమూర్తి ,వార్డ్ కార్పొరేటర్స్ పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, జీవీఎంసీ కమీషనర్, ఉగ్గినిపాలెం గ్రామ సర్పంచ్ గున్నయ్య నాయుడు ఎన్టిపిసి అధికారులు, ఆళ్ల నాగేశ్వరావు సంబంధిత అధికారులు, వైఎస్ఆర్సిపి పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Pardwada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676